ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 27 జూలై 2025 | 5



పర్యాటక.. కడియం!

పచ్చటి నర్సరీలకు.. పర్యాటక శోభ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కడియం నర్సరీలు.. కంటికి కనిపించే స్వర్గధామం.. వేల రకాల మొక్కలు..అరుదైన పండ్ల జాతులు.. ఔషధ మొక్కలు..ఇదో మొక్కల లోకం..కనువిందు చేసే ప్రపం చం..ఊళ్లకు ఊళ్లలో పరుచుకున్న ఈ వనానికి మరింత హంగులు అద్ది.. మెరుగులు దిద్ది అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించేవిధంగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో 14 ఏకో టూరిజం ఎక్స్ పీరియన్స్ సెంటర్లను నిర్మిస్తుండగా ఉమ్మడి తూర్పుగోదావరికి కడియం నర్సరీలకు ఆ అవకాశం దక్కింది. టూరిజం శాఖ తాజాగా రూ.4.95 కోట్లతో టెండరు పిలిచింది. కాంట్రాక్టరుతో ఒప్పందం అనంతరం పనులు ప్రారంభమవుతాయి. నర్సరీల్లోని మౌలిక సదుపాయాలు మెరుగుపరిచి.. పర్యాటకులను ఆకర్షించేలా ఏర్పాట్లు చేస్తారు. అంతర్గత రోడ్లు, అదనపు హంగులు జోడిస్తారు. వివిధ రకాల మొక్కల ప్రదర్శన, చిన్న ఎగ్జిబిషన్లు,సీజనల్ పుష్పోత్స వాలు, గోదారోళ్ల రుచుల రెస్టారెంట్లు, కాఫీ షాపులు, చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్‌మెంట్, పార్కింగ్ ఏరియాలు,కాలువగట్టు బ్యూటిఫికేషన్, బోటింగ్ ఏర్పాటు చేస్తారు. పర్యాటకుల అభిరుచికి అనుగుణంగా ఒక పెద్ద ఆర్చిని నిర్మిస్తారు. పొట్టిలంక నుంచి కడియపులంక వరకూ 28 స్టాల్స్‌ని నిర్మిస్తారు. పర్యాటకులకు వసతి కల్పిస్తారు. నర్సరీలతో ముడిపడిన అనుబంధ రంగాలపై కూడా దృష్టి సారిస్తారు. మొత్తంగా కడియం నర్సరీలను విదేశీ పర్యాటకులు సైతం ఔరా అనే విధంగా తీర్చిదిద్దుతారు. కడియం, కడియపులంక, వేమగిరి, మురముండ, మాధవరాయుడుపాలెం, జేగురుపాడు, దుళ్ల, కడియపుసావరం, మండపేట రూరల్ మండలంలోని పాలతోడు, వెలగతోడు తదితర ప్రాంతాల్లోని సుమారు 5 వేల ఎకరాలకుపైగా నర్సరీలు విస్తరించి అందరినీ ఆకర్షిస్తున్నాయి.





తీర్చిదిద్దుతాం: 'తూర్పు' కలెక్టర్

కడియం నర్సరీలను పర్యాటకపరంగా తీర్చిదిద్దే విధంగా ఒక ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. దీంతో స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. గ్రీన్ ఆర్గానిక్ వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువులను తయారుచేయిస్తాం.



అంతర్జాతీయ ఖ్యాతి ఖాయం: మంత్రి దుర్గేష్

కడియం నర్సరీలకు అంతర్జాతీయంగా ఖ్యాతిని తీసుకొస్తాం. ఈకో టూరిజం ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం. కాలువ గట్టును కూడా అభివృద్ధి చేస్తున్నాం.



అలా.. కాణిచ్చేద్దాం!

గ్రాము రూపు కొనాలన్నా కష్టమే

రూపుల ధరలు ఇలా..

కాణిఎత్తు	200 మిల్లీగ్రాములు	రూ.2,280
అర్ధణా	350మిల్లీ గ్రాములు	రూ.3,800
అణా	700 మిల్లీ గ్రాములు	రూ.7,300
అర గ్రాము		రూ.5,300
గ్రాము		రూ.10,250



- శ్రావణంలోనూ బంగారమే!
- కాణి రూపులకు డిమాండ్
- పెరిగిన బంగారం ధరలే కారణం
- పది గ్రాములు రూ.99,930
- గ్రాము రూపు రూ.10,250
- కొనుగోలుదారుల వెనకడుగు
- ఆచితూచి వ్యాపారుల అడుగులు

శ్రావణమాసం వచ్చిందంటే బంగారానికి ఎక్కడ లేని డిమాండ్ వచ్చి పడేది.. ఎందుకంటే ప్రతి కుటుంబంలో ఒక గ్రాము లక్ష్మీదేవి రూపు కొనుగోలు చేయాలనే తలంపు ఉండేది.. ప్రస్తుతం పెరిగిన ధరల నేపథ్యంలో గ్రాము బంగారం మోయలేక చాలా మంది కాణి రూపుల వైపు చూస్తున్నారు.. మరికొంత మంది అయితే బంగారానికి ప్రత్యామ్నాయం ఏమిటా అని ఆలోచిస్తున్నారు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

శ్రావణం అంటేనే సర్వ శుభకరం.. శుభ ఘడియలే..పండుగలు, వివాహాలు, గృహ ప్రవేశాలు,పూజలు,నోములు, వ్రతాలు.. ఇలా ఈ మాసమంతా శుభకార్యాలు, ఆధ్యాత్మిక శోభతో అలరారుతుంది.అమ్మవార్ల ఆలయాలు కిటకిటలాడుతుంటాయి. మహిళలు ఈ మాసమంతా ఇంటిని లక్ష్మీదేవి ఆలయంగా భావిస్తూ ధూప, దీప నైవేద్యాలతో కొలుస్తారు. ఇక ఇది ముహూర్తాల నెల కావడంతో బంగారానికి డిమాండ్ ఉన్నా.. మంగళ సూత్రాలు, తాడు, ఉంగరాలు వంటి ప్రధానమైన వాటితో సరిపెడుతున్నారు. పసిడి ధరలు పరిగణనలోకి తీసుకుని వరలక్ష్మి రూపులు కాణితో సరిపెడుతున్నారు.

అపురూపమే!

శ్రావణంలో వరలక్ష్మీ వ్రతానికి ఎంత విశిష్టత ఉందో.. పసిడికీ అంతే ప్రాధాన్యం ఇస్తారు. వ్రతంలో లక్ష్మీదేవి మెడలో రూపును అలంకరించి ఆ అమ్మవారు తన ఇంట కొలు వైనట్టు భావిస్తారు. కానీ ప్రస్తుతం బంగారం గారం పోతోంది. గతంలో గ్రాము రూపును అలంకరించిన వాళ్లు ఈసారి కాణి ఎత్తుకూ జంకే విధంగా ధరలున్నాయి. రూపు కొనాలంటే రుణం తప్పదనే నానుడికి జీవం పోస్తున్నాయి. కొన్ని బంగారు దుకాణాల వారు అసలు రూపు జోలికి వెళ్లడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఏడాదిలో రూ.29 వేల పెరుగుదల

బంగారం ధరలు గత మూడేళ్ల నుంచీ పరుగులు పెడుతున్నాయి. గత ఏడాది ఇదే నెలలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.70 వేలు ఉంది. శనివారం చూస్తే 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.99,930లు ఉంది. 22 క్యారెట్ల ధర రూ.91,600 ఉంది. దీంతో గ్రాము రూపునకు రూ.11 వేలు వెచ్చించాల్సి వస్తోంది. 700 మిల్లీ గ్రాములు అణా ఎత్తుకు రూ.8 వేలు, 350 మిల్లీల అర్ధణాకు రూ.4 వేలు చెల్లించాల్సి వస్తోంది. కనీసం 200 మిల్లీల కాణి ఎత్తు కొందామన్నా రూ.2500 వరకూ ఉంది. ఇది ఒకసారి కిందపడితే మళ్లీ కంటికి కనిపించనంత పరిమాణంలో ఉంటుంది. ప్రస్తుత ధరలు చూస్తే వెండి రూపులకు డిమాండ్ పెరగొచ్చని చెబుతున్నారు. వెండి కేజీ రూ.1,18,000లు ఉంది. ఇత్తడి, రాగి రూపుల ప్రసక్తి ఇప్పటివరకూ లేదు. బంగారం ధరలను బట్టి అవి కూడా మార్కెట్లోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది.

రూ.200 కోట్ల వ్యాపారం?

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 50 వరకూ పెద్ద మాల్స్ ఉండగా.. 2 వేల వరకూ మామూలు దుకాణాలు ఉన్నాయి. ఓ మూడేళ్ల కిందట వరకూ శ్రావణం వచ్చిందంటే సుమారు రూ.200 కోట్ల వ్యాపారం జరిగేది. దీంట్లో రూ.50 కోట్ల వరకూ రూపుల వ్యాపారమే ఉండేది. కానీ ఇప్పుడు ఆ అంకె కాస్త అటూ ఇటుగా అలాగే ఉన్నా కొనుక్కొనే వారి సంఖ్య మాత్రం తగ్గినట్లు కనిపిస్తోంది. ఇప్పుడు గ్రాము రూ.10 వేల చొప్పున ఓ వంద రూపులు అమ్మితే రూ.కోటి వ్యాపారం జరిగిపోతోంది. ప్రస్తుత ధరల వల్ల జనం వెనక్కి తగ్గుతుండడంతో వ్యాపారులు వెన కడుగు వేస్తున్నారు. రూపుల వ్యాపారాన్ని ఈసారి విరమించుకున్నామని కొందరు వ్యాపారులు చెబుతున్నారు. అయితే శ్రావణం, ముహూర్తాల వల్ల ఓ 20 రోజుల నుంచీ వ్యాపారం బాగానే జరుగుతోం దని మరికొందరు అంటున్నారు. ఇక సెంటిమెంటుగా.. ఎప్పుడూ గ్రాము రూపే అని భావించే వాళ్లు అప్పు చేసైనా కొంటున్నారు.

ఈ సారైనా కలిసొచ్చేనా..

మూఢం కారణంగా 48 రోజుల పాటు శుభ ముహూర్తాలు లేవు. దీంతో పసిడి విక్రయాలు నెమ్మదించాయి. శ్రావణమాసం ఈ శుక్రవారం 25వ తేదీ నుంచి ప్రారంభం కావడంతో మళ్లీ పసిడి కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయని భావిస్తున్నారు.జూలై నెలలో 26, 30, 31 ఆగస్టులో 1, 3, 5, 7 నుంచి 14, 17 తేదీల్లో శుభ ముహూర్తాలు ఉన్నాయి.శ్రావణం తర్వాత ఆగస్టు 21 నుంచి భాద్రపద మాసం ప్రారంభమవుతుంది. శూన్యమాసం కాబట్టి ముహూర్తాలు ఉండవు. మళ్లీ సెప్టెంబరు 23 నుంచి ఉంటాయి. 8న వరలక్ష్మీ వ్రతం,16 శ్రీ కృష్ణాష్టమి ఉన్నాయి.



రాయవరం మండలం చెల్లూరులో జరిగిన సభలో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఇబ్బందులున్నా సంక్షేమం, అభివృద్ధి ఆగలేదు

- ఐదేళ్ల అరాచక వైసీపీ పాలనకు ఓటుతో రాష్ట్రానికి విముక్తి
- రాష్ట్ర ప్రజలకు రుణపడి ఉంటాం : ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్

రాయవరం,జూలై26(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు సారథ్యంలోని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్ని ఆర్థికపరమైన ఇబ్బందులు వచ్చినా సంక్షేమం, అభివృద్ధి ఆగలేదని రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. రాయవరం మండలం చెల్లూరు గ్రామంలో శనివారం జరిగిన పలు అభివృద్ధి పథకాలను స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు సారథ్యంలో మంత్రి ప్రారంభించారు. తొలుత గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో రూ.69 లక్షలతో నిర్మించే మహిళా స్త్రీశక్తి భవన నిర్మాణం, రూ.90 లక్షలతో నిర్మించే 5 రహదారుల పనులు, రూ.86.40లక్షలతో చేపట్టిన జల్‌జీవన్‌మిషన్ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. అనంతరం స్థానిక కల్యాణ మండపంలో జరిగిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. దేశంలో ఎక్కడలేనివిధంగా ఐదేళ్ల వైసీపీ పాలనలో రూ.10 లక్షల కోట్లు అప్పులు చేసిన ఘనత నాటి సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రజలు ఓటు అనే ఆయుధం ద్వారా వైసీపీ ప్రభుత్వానికి బుద్ధిచెప్పి రాష్ట్రాన్ని కాపాడారని ఆయన అన్నారు. కూటమికి ఓటువేసిన ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి, మహిళల సంక్షేమం కోసం ఇంటిని చక్కదిద్దే మహిళలాగా నిత్యం ఆలోచిస్తూ ఏవిధంగా రాష్ట్రాభివృద్ధి సాధించాలన్న తపనతో ఉన్నారన్నారు. రాష్ట్రం ఖజానా ఖాళీ అయిందని, అయితే సంక్షేమ పథకాలు ఆగకుండా కేంద్రం ఇచ్చే నిధులతో రాష్ట్రంలో పథకాలు అమలుచేస్తున్నామన్నారు. ప్రధాని నరేంద్రమోదీ అందిస్తున్న సాయం మరువలేనిదన్నారు. రాష్ట్రంలో కూటమికి వెన్నుదన్నుగా ఉన్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కూడా అభివృద్ధి విషయంలో సహకరిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ మండపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనలో ఇరిగేషన్ వ్యవస్థ నాశనమైందని, కూటమి ప్రభుత్వం చక్కదిద్దుతోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, నల్లమిల్లి వీర్రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్, కార్పొరేషన్ డైరెక్టర్‌లు జయబాబు, దొరబాబు, గడిసత్యవతి రాంబాబు, చెల్లూరు గ్రామ సర్పంచ్ పాలిక రాఘవ పాల్గొన్నారు.



అమలాపురంలోని కలెక్టరేట్‌లో ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హేష్‌కుమార్

బెల్టుషాపులు, అక్రమ మద్యం రవాణాను నిరోధించాలి

ఎక్సైజ్‌శాఖ అధికారుల సమీక్షలో కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన లైసెన్సులు మంజూరు చేసిన వారే మద్యం దుకాణాల ద్వారా విక్రయాలు చేపట్టాలి తప్ప, నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులు నిర్వహించకుండా పటిష్ఠ చర్యలను ఎక్సైజ్‌శాఖ అధికారులు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ పరిధిలోని సర్కిల్ ఇనస్పెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ఆరు సర్కిళ్ల పరిధిలో 146 మద్యంషాపులు, పది బార్లు, ఒక టూరిజం రెస్టారెంట్, బారు ఉన్నాయని, వీటిలో సమయ పాలన ప్రకారం మద్యం విక్రయాలు నిర్వహించాలని సూచించారు. అక్రమ మద్యం, కల్తీ మద్యం విక్రయాలు, రవాణా జరగకుండా పటిష్ఠంగా నిరోధించాలన్నారు. అక్రమ మద్యం తయారీ, రవాణాను నిరోధించాలని కలెక్టర్ కోరారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారులు సారాతయారీదారులు, అక్రమ మద్యం తయారీదారులపై ప్రత్యేక దృష్టి సారించి నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. మద్యం లైసెన్సు దుకాణదారులు షరతులు ఉల్లంఘించకుండా వాటిని పాటిస్తున్నారో లేదో తనిఖీలు చేయాలన్నారు. మద్యం అమ్మకం ద్వారా వచ్చే పనులు వసూలుచేసి కల్తీ మద్యం, అక్రమ మద్యం రవాణా, అమ్మకాలను పూర్తిగా అరికట్టాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకు మాత్రమే మద్యం విక్రయాలు జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎక్సైజ్ అధికారులపై ఉందని కలెక్టర్ ఆదేశించారు. నవోదయం 2.0 కార్యాచరణను బలోపేతం చేసే లక్ష్యంతోనే పనిచేస్తున్నట్టు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్ తెలిపారు. అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో లూజు మద్యం తయారీదారులు, విక్రయదారులపై కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నట్టు తెలిపారు. సమీక్షలో జిల్లాలోని ఎక్సైజ్ సర్కిల్, స్క్వాడ్ ఇనస్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సంతృప్తి స్థాయిలు పెంచాలి..

కోనసీమ జిల్లా పరిధిలోని నాలుగు ఆర్టీసీ డిపోల మేనేజర్లతో శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. ప్రజాసంతృప్తి స్థాయిలను నిత్యం ఐవీఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం పరిశీలిస్తుందని, ఆ దిశగా ఆర్టీసీ సేవల్లో ప్రజలు సంతృప్తి స్థాయిని మెరుగుపరచాలని డిపో మేనేజర్లకు సూచించారు.

జర్మన్ భాషలో ఉచిత శిక్షణ, ఉపాధి... ఎస్సీ, ఎస్టీ మహిళలకు అవకాశం

అమలాపురం,జూలై26(ఆంధ్రజ్యోతి):ఎస్సీ, ఎస్టీ, నర్సింగ్ మహిళా విద్యార్థులకు జర్మనీ భాషలో ఉచిత శిక్షణ కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన మహిళా నర్సింగ్ పట్టభద్రులకు జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్న దృష్ట్యా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, గిరిజనసంక్షేమం, సంక్షేమశాఖల సంయుక్త ఆధ్వర్యంలో జర్మన్ భాష నేర్పే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తిరుపతి, గుంటూరు, విశాఖపట్నంలోని శిక్షణ కేంద్రాల్లో జర్మన్ భాష ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకోసం ఈ శిక్షణ ఇవ్వనున్న దృష్ట్యా, 35 ఏళ్లలోపు వయసు కలిగి జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసినవారు అర్హులని, వీరికి పది నెలలపాటు శిక్షణ ఇస్తారని, ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తారని తెలిపారు. ఉద్యోగాల్లో ఎంపికైనవారికి నెలకు రూ.2.4 లక్షల నుంచి రూ.3.10 లక్షల వరకు లభిస్తుందని, ఆసక్తి ఉన్నవారు 9988853335, 8712655686 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అప్పనపల్లి బాలబాలాజీకి ప్రత్యేక పూజలు



బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు, జూలై 26(ఆంధ్రజ్యోతి): శ్రావణమాస శనివారంకావడంతో అప్పనపల్లి బాలబాలాజీస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలి హారతి ఇచ్చారు. స్వామివారిని పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. దేవస్థానంలో జరిగే లక్ష్మీనారాయణ హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కొత్త, పాత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారిని శనివారం ఒక్కరోజు 4 వేల మంది దర్శించుకుని, నిత్యాన్నదాన పథకంలో 2500 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారన్నారు. వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,40,081 ఆదాయం వచ్చినట్టు సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.



గోపాలపురంలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జనార్దనరెడ్డి

మద్యం కేసులో ఎంత పెద్దవారైనా చట్టం వదిలిపెట్టదు!

- ఆర్అండ్‌బీ, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖామంత్రి బీసీ జనార్దనరెడ్డి
- గోపాలపురంలో పలు కార్యక్రమాలకు హాజరు

7



కష్టాల తీరం దాటాలని : అంతర్వేది సముద్ర తీరం వెంబడి పంట పొలాల రక్షణకు రైతులు వేసిన గట్లు

అలజడిని.. ఆపేసి!

భూరక్షణకు గట్లు

- ఉప్పుతో చేలకు ముప్పు
- కయ్యలుగా మారుతున్న వైనం
- గట్లు నిర్మిస్తున్న రైతాంగం
- సముద్రపు నీటికి అడ్డుకట్ట



(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాతం సముద్ర తీరంలో అలజడులు ఉత్పన్నమైనప్పుడు సమీపంలోని సారవంతమైన భూములను సముద్రపు కెరటాలు తరచూ ముంచెత్తుతున్నాయి. దీని కారణంగా పంట పొలాలు ఉప్పునీటి కయ్యలుగా మారిపోతున్నా ఎవరూ పట్టించుకోలేదు. దాంతో తీర ప్రాంత గ్రామాల్లో ఉన్న రైతులే చందాలు వేసుకుని పంట పొలాలను సంరక్షించుకునే పనిలో పడ్డారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా.. సముద్రంలో ఆటుపోట్లు ఏర్పడినా కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడి తీరప్రాంత భూముల్లోకి ఉప్పునీరు భారీగా చేరుతోంది. దాంతో సఖినేటిపల్లి మండలంలోని తీర గ్రామాల్లో ఏకంగా సముద్ర ప్రవాహం తమ పొలాల్లోకి చొచ్చుకు రాకుండా భారీగా గట్లను రైతులే స్వచ్ఛందంగా నిర్మించుకుంటున్నారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేది, అంతర్వేది దేవస్థానం ప్రాంతంలో ఇప్పటికే సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర భారీగా గట్లను నిర్మింప చేశారు. మరికొన్ని రోజుల్లో కేశవదాసుపాలెంలో కూడా సముద్ర తీరం వెంబడి గట్టు నిర్మాణానికి రైతులు ముందుకొస్తున్నారు. పది అడుగుల ఎత్తున ఇప్పటి వరకు సుమారు 8 కిలోమీటర్ల మేర అంతర్వేది, అంతర్వేది దేవస్థానం గ్రామాల్లో భారీగా గట్లను నిర్మించారు. తీర ప్రాంత భూములను ఉప్పునీటి బారి నుంచి రక్షించుకునే ప్రయత్నంలో విజయవంతమయ్యామని ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు. ఇదే స్ఫూర్తితో పక్కనే ఉన్న కేశవదాసుపాలెంలో కూడా సముద్ర తీరం వెంబడి గట్టును నిర్మించుకోవడం ద్వారా భూములను సంరక్షించుకునేందుకు రైతులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి తీర ప్రాంతంలో సముద్రపు మట్టితోనే పటిష్ఠంగా గట్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఎటువంటి సమస్యలు ఉత్పన్నమైనా ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఉండవని ప్రభుత్వం ఈ ప్రక్రియ వైపు దృష్టి సారించి భూముల రక్షణకు చర్యలు చేపట్టాలని బంగాళాఖాతం తీర ప్రాంతం వెంబడి ఉన్న గ్రామాల రైతులు ముక్త కంఠంతో చంద్రబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా..

తీరం వెంబడి రైతులు పటిష్ఠంగా గట్లు నిర్మించినప్పటికీ సముద్రపు ఇసుక అక్రమ చౌర్యం కొనసాగుతూనే ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తీరం వెంబడి ఉన్న గ్రామాల నుంచి సముద్రానికి వెళ్లే దారులను అక్రమ ఇసుక రవాణాకు మార్గాలుగా ఎంచుకుంటున్నారు. సముద్రం వెంబడి భారీగా ఉన్న ఇసుక తిన్నెలను రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు తరలించి ఇసుక మాఫియా సొమ్ములు చేసుకుంటుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులు స్పందించి వాటిపై చర్యలు తీసుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఆచరణలో విఫలం కావడానికి సవాలక్ష కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా సముద్ర తీరం వెంబడి ఇసుక తవ్వకాలు సాగించే మాఫియాకు అధికారులతో ఉన్న సంబంధాలే ఇందుకు కారణంగా చెబుతున్నారు. గట్లు ఉన్నప్పటికీ వాటిని కొన్నిచోట్ల ఛిద్రంచేసి మరీ సముద్రపు ఇసుకను తరలించుకుపోతున్న ఇసుక మాఫియాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని తీరప్రాంత వాసులు కోరుతున్నారు.



ఉచిత గ్యాస్.. బుక్ చేశారా?

- రెండో ఉచిత సిలిండరు బుకింగ్‌కు నెలాఖరు వరకే సమయం
- 31వ తేదీతో గడువు ముగింపు
- ఆగస్టు 1నుంచి మూడో సిలిండరు బుకింగ్ ప్రారంభం
- నవంబర్ నెలాఖరు వరకు దీనికి గడువు
- తొలి సిలిండర్ బుక్ చేసుకున్నది 12 లక్షల 56 వేల మంది..
- రెండో సిలిండర్ ఇప్పటికే బుక్ చేసుకున్న వారు 12 లక్షల11 వేల మంది

ఇక ఐదురోజులే మిగిలింది.. దేనికీ అనుకుంటున్నారా..? ఉచిత 'గ్యాస్' సిలెండర్ పొందడానికి.. ఈనెలాఖరు వరకే సమయం ఉంది. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న దీపం-2 ఉచితగ్యాస్ సిలిండర్ల పథకానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనూహ్య స్పందన లభించింది. మొదటి సిలిండర్‌ను పెద్దఎత్తున లబ్ధిదారులు బుక్ చేసుకుని లబ్ధిపొందగా ప్రస్తుతం రెండో సిలిండర్ బుకింగ్ నడుస్తోంది.

కలెక్టరేట్(కాకినాడ), జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దీపం-2 పథకం 2024 నవంబరులో ప్రారంభమైంది. కూటమి ప్రభుత్వం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను పేదలకు ఉచితంగా ఇవ్వాలనే మహా సంకల్పంతో దీన్ని ప్రారంభించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 14 లక్షల మంది దీనికి అర్హులు ఉన్నారు. దీనిలో తొలి ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం 12 లక్షల 56 వేల మంది బుకింగ్ చేసుకున్నారు. వీరి బ్యాంకు ఖాతాల్లో రూ.108 కోట్లు సబ్సిడీ సొమ్ము జమ అయింది. 2024, నవంబరు నుంచి 2025, మార్చి నెలాఖరు వరకు బుకింగ్స్ జరిగాయి. లక్షా 44 వేల మంది వివిధ కారణాల వల్ల తొలి గ్యాస్ సిలిండర్లకు బుకింగ్ చేసుకోలేకపోయారు. రెండో ఉచిత గ్యాస్ సిలిండరు పథకానికి గత ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. ఈనెలాఖరుతో గడువు ముగుస్తోంది. రెండో గ్యాస్ సిలిండరుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటివరకు 12 లక్షల 11వేల మంది బుకింగ్ చేసుకున్నారు. వీరి బ్యాంకు ఖాతాల్లో రూ.99 కోట్ల సబ్సిడీ సొమ్ము జమ అయింది. లక్షా 89 వేలమంది ఇంకా బుకింగ్ చేసుకోవాల్సి ఉంది. ఐదురోజులు మాత్రమే దీనికి గడువు ఉంది. ఈలోపు రెండో గ్యాస్ సిలిండరు బుకింగ్ చేసుకోకపోతే తర్వాత అవకాశం ఉండదు. ఆగస్టు 1 నుంచి మూడో ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ ప్రారంభమవుతుంది. జిల్లాల వారీగా పరిశీలిస్తే...

కాకినాడ జిల్లాలో..

కాకినాడ జిల్లాలో తొలి గ్యాస్ సిలిండరుకు 4 లక్షల 50వేలమంది బుకింగ్ చేసుకోగా రూ.39 కోట్ల 51లక్షలు బ్యాంకు ఖాతాల్లో జమ అయింది. రెండో గ్యాస్ సిలిండరుకు 4లక్షల 52వేలమంది ఉచిత గ్యాస్‌కు బుకింగ్ చేసుకోగా రూ.35 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ అయింది. మిగిలిన వారికి కూడా వారం రోజుల్లో జమ కానుంది.

కోనసీమ జిల్లాలో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తొలి ఉచిత గ్యాస్ సిలిండరుకు 3లక్షల 95 వేలమంది బుకింగ్ చేసుకోగా రూ.34కోట్ల 10 లక్షలు జమయింది. రెండో గ్యాస్ సిలిండరుకు 3 లక్షల 67వేల మంది బుకింగ్ చేసుకోగా రూ.31 కోట్ల 14 లక్షలు బ్యాంకు ఖాతాల్లో జమ అయిందని అధికారవర్గాలు తెలిపాయి.

తూర్పుగోదావరి జిల్లాలో..

తూర్పుగోదావరి జిల్లాలో తొలి ఉచితగ్యాస్ సిలిండరుకు 4 లక్షల 5వేలమంది బుకింగ్ చేసుకోగా రూ.35 కోట్ల 50లక్షలు జమ అయింది. రెండో గ్యాస్ సిలిండరుకు 3లక్షల 78వేల మంది బుకింగ్ చేసుకోగా రూ.31కోట్ల 64లక్షలు బ్యాంకు ఖాతాల్లో జమ అయింది.

ఆగస్టు 1నుంచి మూడో సిలిండరు బుకింగ్ చేసుకోవాలి

ఆగస్టు 1 నుంచి లబ్ధిదారులు మూడో సిలిండరుకు బుకింగ్ చేసుకోవచ్చు. బుకింగ్ చేసుకున్న సొమ్ములు జమ కానివారికి మరో వారంరోజుల్లో జమ అవుతాయి. దీపం-2 గ్యాస్ పథకంలో అర్హులు అందరూ బుకింగ్ చేసుకోవచ్చు. ఏమైనా సందేహాలుంటే పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో అధికారులను సంప్రదించాలి. టోల్‌ఫ్రీ నెంబరు 1967కి కూడా కాల్ చేయవచ్చు.

- సత్యనారాయణరాజు, పౌరసరఫరాల శాఖాధికారి, కాకినాడ జిల్లా



రావులపాడు ప్రభుత్వ పాఠశాలలో యు ఆకారంలో బెంచీలు ఏర్పాటుచేసిన ఉపాధ్యాయులు

నో బ్యాక్ బెంచ్!

- రావులపాడు ప్రభుత్వ పాఠశాలలో వినూత్న ప్రయోగం
- యు ఆకారంలో బెంచీల ఏర్పాటు

రావులపాలెం, జూలై 26(ఆంధ్రజ్యోతి): క్లాస్‌రూమ్‌లో బ్యాక్ బెంచీలో కూర్చునే విద్యార్థులంటే అల్లరి చేసేవారనో, సరిగ్గా చదవని వారనో ప్రచారం. క్లాస్‌రూమ్‌లో బెంచీ వెనుకాల బెంచీ ఉండడం వల్ల పాఠంచెప్పే ఉపాధ్యాయుల దృష్టి కూడా వెనుక ఉన్న విద్యార్థులపై తక్కువగా ఉంటుంది. విద్యార్థులంతా ఉపాధ్యాయులకు కనిపించేవిధంగా బ్యాక్ బెంచీ విధానానికి స్వస్తి పలకాలనే సంకల్పంతో రావులపాలెం మండలం రావులపాడు హైస్కూల్‌లో ఉపాధ్యాయులు వినూత్న ప్రయత్నం చేశారు. పాఠశాలలో యు ఆకారంలో బెంచీలు ఏర్పాటుచేసి అందరూ విద్యార్థులు ఉపాధ్యాయులకు కనిపించే విధంగా విద్యాబోధన చేపట్టే ప్రయోగం చేశారు. గత ఏడాది వినేష్‌విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన మళయాళం సినిమా స్థానార్థి శ్రీకుట్టన్ క్లైమాక్స్ సీన్ స్ఫూర్తితో తొలుత కేరళలోని పాఠశాలలో ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇదే తరహాలో ఇటీవల తిరుపతి జిల్లాలో కూడా యు ఆకారంలో బెంచీలు ఏర్పాటుచేసి విద్యాబోధనచేసే ప్రయోగం చేశారు. దీంతో బ్యాక్ బెంచీ విధానానికి స్వస్తి పలకాలనే విధానంతో విద్యార్థులందరి ముఖాలు స్పష్టం గా ఉపాధ్యాయులకు కనిపించేవిధంగా యు ఆకారంలో బెంచీలను ఏర్పాటుచేసినట్టు హెచ్‌ఎం మధుసూదనరావు అన్నారు.



రాజోలులో..

రాజోలు, జూలై26(ఆంధ్రజ్యోతి): రాజోలులో మండల ప్రజాపరిషత్ కోఆపరేటివ్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె.ఏసుబాబు తరగతుల్లో వెనుక కూర్చొని అల్లరి చేసే విద్యార్థులు లేకుండా ఇటీవల సిటింగ్ అరెంజ్‌మెంట్ చేశారు. ఈ విధంగా చేయడం వల్ల ఉపాధ్యాయుడి దృష్టి అందరి విద్యార్థులపై ఉంటుందని ఆయన తెలిపారు. క్లాస్‌రూములో బెంచి వెనుక బెంచి ఉండడం వల్ల పాఠం చెప్పే ఉపాధ్యాయుల దృష్టి కూడా వారిపై తక్కువ ఉంటుందని, దీనికి చెక్ పెడుతూ యు ఆకారంలో బెంచీలు ఏర్పాటు చేసి వినూత్న ప్రయోగం చేశామని, ఇప్పటికే ఈ స్కూల్ మోడల్ స్కూల్‌గా ఉందన్నారు.



పొల్లూరు జలపాతం వద్ద పర్యాటకుల సందడి

మోతుగూడెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలోని పొల్లూరు జలపాతం వద్ద శనివారం పర్యాటకులు సందడి చేశారు. వారాంతం కావడంతో అధికసంఖ్యలో విచ్చేశారు. మంత్రి నారా లోకేశ్ ఓఎస్డీ ఆకుల వెంకట రమణ తన స్నేహితులతో కలిసి పొల్లూరు జలపాతాన్ని సందర్శించారు. గతంలో ఆయన ఇక్కడ చింతూరు ఐటీడీఏ పీవోగా చేశారు. వారాంతపు సెలవులు కావడంతో మోతుగూడెం పరిసర ప్రాంతాలన్నింటినీ సందర్శించారు. దంతెవాడ జిల్లా ఎస్పీ గౌరవ్‌రాయి తన కుటుంబ సభ్యులతో జలపాతాన్ని సందర్శించారు. జలపాతాల్లో ఆటపాటలు ఆడి సరదాగా గడిపారు.



షూటింగ్ స్పాట్‌లో బోయపాటి

అఖండ2 షూటింగ్ స్పాట్‌లో..

మోతుగూడెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలోని పొల్లూరు జలపాతం పిక్నిక్ స్పాట్ వద్ద అఖండ-2 సినిమా షూటింగ్ శనివారం జరిగింది. మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే ఆరురోజులుగా చిత్రీకరణ జరుగుతోంది. వారం రోజులపాటు సాగే ఈ షెడ్యూల్లో బాలకృష్ణపై కొన్ని కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నామని డైరెక్టర్ బోయపాటి శ్రీను తెలిపారు. నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కలయికలో వరుసగా మూడు సినిమాలతో సంచలన విజయాన్ని సొంతం చేసుకోగా, ఈ ఇద్దరు నాలుగో చిత్రం కోసం మరోసారి జట్టు కట్టారు. ఈ చిత్రం విజయవంతమైన అఖండకి సీక్వెల్‌గా అఖండ 2 తాండవం పేరుతో రూపొందుతోంది. రామ్ ఆచంట.. గోపి ఆచంట నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి సమర్పిస్తున్నారు.

హరిహర వీరమల్లు.. నేడు విద్యార్థులకు ఫ్రీ షో

రాజానగరం ఎమ్మెల్యే బత్తుల ప్రత్యేక ఏర్పాటు

రాజానగరం,జూలై26(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' సినిమాను నియోజకవర్గంలో మూడు మండల కేంద్రాల్లోని థియేటర్లలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో ఉచిత ప్రదర్శన ఏర్పాటుచేసినట్టు జనసేన పార్టీ మండల కన్వీనర్ వేగిశెట్టి రాజు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో తొమ్మిది, పది తరగతులు చదువుతున్న విద్యార్థులతోపాటు ఇంటర్, డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థుల కోసం స్పెషల్ షో ఏర్పాటుచేశామన్నారు. రాజానగరంలోని ఫార్చ్యూన్ థియేటర్ లోనూ, సీతానగరంలో గీతా థియేటర్‌లో, కోరుకొండలో రామకృష్ణ థియేటర్‌లోనూ ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఉచిత ప్రదర్శన ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు.



కలెక్టర్ షాన్‌మోహన్‌కు చెక్కు అందజేస్తున్న శ్రీప్రకాష్ డైరెక్టర్ విజయ్‌ప్రకాష్

ఆర్మీ ర్యాలీకి 'శ్రీప్రకాష్' రూ.2లక్షలు విరాళం

కలెక్టరేట్(కాకినాడ), జూలై 26(ఆంధ్రజ్యోతి): వచ్చేనెలలో కాకినాడజిల్లా క్రీడా మైదానంలో జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, మహిళల హాకీ టోర్నమెంట్‌ల నిర్వహణకు శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ తరపున డైరెక్టర్ విజయ్‌ప్రకాష్ రూ.2లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ చెక్కును శనివారం కాకినాడజిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు ఆయన అందజేశారు. ఈనేపథ్యంలో శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్‌ను కలెక్టర్ అభినందించారు.

హేచరీస్ ఓనర్స్ రూ.6లక్షల విరాళం

కలెక్టరేట్(కాకినాడ), జూలై 26 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెలలో జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు హేచరీస్ ఓనర్స్ రూ.6లక్షలు విరాళం కింద శనివారం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు అందజేశారు. ఈనేపథ్యంలో హేచ రీస్ ఓనర్స్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభి నందనలు తెలిపారు. కాకినాడజిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమానికి విరాళం ఇవ్వడం సంతోషమన్నారు.

ఐసీపీలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

జేఎన్టీయూకే, జూలై 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ, బీటీహెచ్ స్వీడన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కొలాబొరేటివ్ ప్రోగ్రామ్ (ఐసీపీ)లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్‌ను వర్సిటీలోని సెనేట్ హాల్లో నిర్వహించారు. మొదటిగా బీటీహెచ్ స్వీడన్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.గురుదత్ విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తిచేశారు. బీటెక్ సీఎస్ఈ, ఏఐఎంఎల్, ఈసీఈ, ఈఈఈ కోర్సులలో ప్రవేశాలకుగానూ 70మంది హాజరుకాగా సీఎస్ఈ, ఏఐఎంఎల్‌లో 28 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు పీఆర్వో ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. కౌన్సెలింగ్‌లో రెక్టార్ వీవీ సుబ్బారావు, డైరెక్టర్లు రాము, స్వర్ణకుమారి, ప్రిన్సిపాల్ మోహన్‌రావు పాల్గొన్నారు.

భక్తవత్సల గోవింద.. గోవిందా

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు
- స్వామివారి ఆదాయం రూ.60.51లక్షలు

ఆత్రేయపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి):కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, భాలబోగం కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు చిరుజల్లులను లెక్కచేయకుండా స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవలద్వారా స్వామివారి ఒక్కరో జు ఆదాయం రూ.60,51,996లు లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

కిక్కిరిసిన శృంగారవల్లభస్వామి ఆలయం

పెద్దాపురం : మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. సుమారు 8వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రూ.1,88,861 ఆదాయం సమకూరినట్లు ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభస్వామి




వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, తిరువీధులలో ప్రదక్షణలు నిర్వహిస్తున్న భక్తులు

శివభక్తులకు మార్గదర్శిగా యాత్రాదర్శిని పుస్తకం

- ద్రాక్షారామం 108 పాద శివలింగాల యాత్రాదర్శిని పుస్తకం ఆవిష్కరణ



యాత్రాదర్శిని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బాదం బాలకృష్ణ, సాంబశివరావు

సర్పవరం జంక్షన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడరూరల్ రమణయ్యపేట శ్రీపీఠంలో శనివారం పుస్తక ప్రచురణకర్తలు డాక్టర్ గరికి పర్తి నమశ్శివాయ నాగమణి దంపతుల ఆధ్వర్యంలో మంగవతి రచించిన ద్రాక్షారామం 108 పాద శివలింగాల యాత్రాదర్శిని పుస్తకాన్ని శివభక్తులు కాళ్ల సాంబశివరావు, లయన్స్‌క్లబ్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాత్రాదర్శిని పుస్తకం శివభక్తులకు మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. పరిసరాల్లో ఉన్న శివాలయాల వివరాలు, వాటి ప్రాధాన్యం తెలుసు కోవడంద్వారా సులువుగా దర్శనం, పూజలు చేసుకునేందుకు యాత్రదర్శిని పుస్తకం భక్తులకు ఉపయోగపడుతుందన్నారు. నాలుగేళ్లలో 108 శివలింగాలను దర్శించుకుని యాత్రాదర్శిని పుస్తకాన్ని రచించినట్లు రచయిత సాంబశివరావు తెలిపారు. సత్కళావాహిని సభ్యురాలు కుంచి లక్ష్మి ఆధ్వర్యంలో పుస్తక ప్రచురణకర్తలు ఓం నమశ్శివాయనాగమణి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జంగం సంఘం నాయకులు నోగేశ్వరరావు, నాగమణి, మిగడరామం, బీవీఎల్ దాస్, కుంజికా లక్ష్మి, కూచి రామం, ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ దూరవిద్యలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

కాకినాడరూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఏయూ ఓపెన్, డిస్టెన్స్ లెర్నింగ్, ఆన్‌లైన్ మోడ్ విధానంలో 2025-26 విద్యాసంవత్సరానికిగానూ ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైనట్లు కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల ఆంజనేయులు తెలిపారు. ఏయూ దూరవిద్యలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకోసం స్టడీ సెంటర్లో సంప్రదించాలని, ఇతర వివరాలకు 9848405370లో సంప్రదించాలని ఏయూ స్టడీసెంటర్ సమన్వయకర్త కె.నాగేశ్వరరావు తెలిపారు.

ఎర్రకోట వేడుకలకు గోకివాడ సర్పంచ్

- రాష్ట్రంలో పది గ్రామాల సర్పంచ్‌లకు అవకాశం



పిఠాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోటవద్ద జరిగే స్వాతంత్ర్య దినోత్సవంలో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రత్యేక అతిథిగా పాల్గొనేందుకుగానూ పిఠాపురం మండలం గోకివాడ సర్పంచ్ కీర్తి హరనాథబాబు ఎంపికయ్యారు. సతీసమేతంగా ఈ యన అక్కడ జరిగే వేడుకల్లో రాష్ట్రం తరపున ప్రత్యేక అతిథిగా పాల్గొంటారు. ఈ మేరకు పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు వీ ఆర్ కృష్ణతేజ నుంచి సమాచారం అందింది. ఈ వేడుకలకు హాజరయ్యేందుకుగానూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పది జిల్లాల నుంచి పది మంది సర్పంచ్‌లను రాష్ట్రప్రభుత్వం ఎంపికచేసింది. ఇందులో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు నుంచి హరనాథబాబుకే అవకాశం దక్కింది. గ్రామాభివృద్ధికి చేస్తున్న కృషికిగానూ హరనాథబాబుకు ఈ అవకాశం లభించిందని అధికారులు తెలిపారు.



సముద్రం వైపు ఉరకలు వేస్తున్న గోదావరి ప్రవాహం

ఉధృతంగా గోదావరి

- 4,36,321క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సీజన్లో గోదావరికి మరోసారి ఒక మోస్తరు వరద ప్రవాహం తరలి వస్తోంది. ఉపనదులు ప్రాణహిత, ఇంద్రావతి, శబరి ఉధృతంగా ప్రవహిస్తూ గోదావరిలో కలుస్తూ ఉండటంతో ధవళేశ్వరంవద్ద నీటి ఉధృతి పెరుగుతోంది. దీంతో కాటన్ బ్యారేజ్ 175 గేట్లను ఒక మీటరు మేర పైకి ఎత్తి 4,36,321క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఆదివారం నాటికి మరో లక్ష క్యూసెక్కులకుపైగా ప్రవాహం పెరిగి 5లక్షల క్యూసెక్కులు దాటవచ్చని అంచనా వేస్తున్నారు. ఇదే సమయంలో ఎగువ ప్రాంతాల్లో వరద ఉధృతి నెమ్మదించింది. భద్రాచలం వద్ద 24 గంటల వ్యవధిలో 10 అడుగుల మేర పెరిగిన నీటిమట్టం శనివారం సాయంత్రానికి 35.30అడుగులకు చేరుకుంది. వ్యవసాయ అవసరాల కోసం కాటన్‌బ్యారేజ్ నుంచి 3 డెల్టాలకు 7700క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ఏమిటి.. ఎందుకు.. ఎలా?

- పుష్కరాలకు.. ఏం చేద్దాం?
- రైల్వేస్టేషన్‌ని పరిశీలించిన పీసీసీఎం రమేశ్



రైల్వేస్టేషన్‌ని పరిశీలిస్తున్న పీసీసీఎం రమేశ్

రాజమహేంద్రవరం, జూలై26(ఆంధ్రజ్యోతి):రాజమండ్రి రైల్వేస్టేషన్‌ని ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఎస్.రమేశ్ శనివారం పరిశీలించారు. స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలు, ప్రాంగణం, గూడ్స్‌షెడ్, తూర్పువైపున మూతబడిన రైల్వే స్కూలు తదితర ప్రదేశాల్లో కలియ తిరిగారు. రానున్న గోదావరి పుష్కరాలకు చేయాల్సిన ఏర్పాట్లపై ప్రధానంగా దృష్టి సారించారు. గత పుష్కరాలకు రోజుకు రాజమండ్రి రైల్వేస్టేషను గుండా రోజుకు 50వేల మంది వరకూ ప్రయాణించారు. ఇప్పుడు ఈసంఖ్య రెండింతలు కావచ్చనే అంచనాలు ఉన్నాయి. దీంతో రైల్వేస్టేషను, బయట ఖాళీ ప్రదేశాలను ఏవిధంగా వినియోగించుకోవాలనే అంశాన్నే ప్రధానంగా తీసుకున్నారు. అనంతరం వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. పుష్కరాలకు అవసరాలు, మౌలిక సదుపాయాలు, ప్రయాణాల అంచనా, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ప్రవేశ నిర్గమ ద్వారాలు, ప్రయాణికుల హోల్డింగ్ ఏరియాలు, మరుగుదొడ్లు తదితర ఏర్పాట్లు ఎక్కడ, ఎలా చేయాలని చర్చించారు. అందుబాటులో ఉన్న ఖాళీ ప్రదేశాలు, గదులపై ఆరా తీశారు. అక్కడి నుంచే దక్షిణమధ్య రైల్వే జీఎంతో వీడియో కాన్ఫరెన్సింగ్ విధానంలో మాట్లాడారు. విభాగాలవారీగా సమీక్షించారు. స్థానిక అధికారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బయలుదేరి కాకినాడ వెళ్లారు. పీసీసీఎం వెంట ఎస్ఎంఆర్ రంగనాథ్, ఆర్పీఎఫ్ పోస్ట్ కమాండర్ రాజు, సీసీఐ కళ్యాణ్, డివిజనల్ అధికారులు ఉన్నారు.



మూతబడిన రైల్వే స్కూల్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పీసీసీఎం

అంతర్వేదిలో నీలకంఠేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.3.50 కోట్లు

అంతర్వేది, జూలై 26(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది పుణ్యక్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం అత్యంత పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందింది. క్షేత్ర పాలకుడిగా తొలి దర్శనం అందుకుంటున్న స్వామివారి ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. ఈ ఆలయ పునఃనిర్మాణం, ముఖ మండపం, నూతన ధ్వజస్తంభం ఏర్పాటు, ప్రహరీ పునఃనిర్మాణం నిమిత్తం రూ.3.50 కోట్లు దేవదాయశాఖ కామన్ గుడ్‌ఫండ్ నుంచి కమిషనర్ ఉత్తర్వుల మేరకు మంజూరు చేశారని ఇన్‌చార్జి ఈవో వరప్రసాద్ తెలిపారు. మ్యాచింగ్ కంట్రిబ్యూషన్‌గా రూ.కోటి 16లక్షల 67వేలు భక్తుల నుంచి నెల రోజుల్లోపు సేకరిస్తే మిగిలిన రూ.2కోట్ల 33లక్షల 33వేలు నిధులు విడుదల చేస్తారని ఈవో తెలిపారు. భక్తులెవరైనా ముందుకు వచ్చి ఆలయ పునఃనిర్మాణంలో దాతలుగా భాగస్వాములైతే పునఃనిర్మాణ పనులు మరింత వేగవంతంగా జరుగుతాయని పేర్కొన్నారు.

పంపా ఆయకట్టుకు నీరు విడుదల

అన్నవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పంపా రిజర్వాయర్ నుంచి శనివారం ఖరీఫ్ పంటకు ఆకుమడులు వేసుకునేందుకు నీటిని టీడీపీ నాయకుడు యనమల రాజేష్ గంగమ్మతల్లికి పూజలు నిర్వహించి విడుదల చేశారు. ప్రస్తుతం 94 అడుగుల నీటిమట్టం రిజర్వాయర్‌లో ఉండగా ఆకుమడుల కోసం రోజుకు 40 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామని, రైతుల అవసరాలకు అనుగుణంగా దీనిని 100 క్యూసెక్కులకు పెంచుతామని ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు పేర్కొన్నారు.


నీరు విడుదల చేస్తున్న యనమల రాజేష్

జయ..జయ సత్యదేవా

వేడుకగా స్వామివారి ఆవిర్భావ దినోత్సవం
పండితులకు ఘనంగా సత్కారం


సత్యదేవుడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం, పండితులను సత్కరిస్తున్న చైర్మన్ రోహిత్

అన్నవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జయ..జయ సత్యదేవా నామస్మరణతో రత్నగిరి ఆలయ ప్రాంగణం మార్మోగింది. స్వామివారి 135వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని శనివారం ఆలయంలో విశేష కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున 2 గంటలకు స్వామి,అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగనస్నానమాచరింపచేశారు. అనంతరం మూలవరులను పంచామృతాలతో అభిషేకించారు. నవగ్రహమూల మంత్రములు, జపములు, పారాయణలు అనంతరం చతుర్వేద పండితులు మహదాశీర్వచనాలు అందజేయగా అనివేటి మండపంలో హోమ పూర్ణాహుతి గావించారు. కార్యక్రమంలో చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో వీర్ల సుబ్బారావు పాల్గొన్నారు. వారు పండితులను ఘనంగా సత్కరించారు. ఆరుగురు పండితులతో పాటుగా 12మంది రిటైర్డ్ వైదిక సిబ్బందిని పంచె, కండువా, నగదు పారితోషకం ఇచ్చి సన్మానించారు. అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో, చైర్మన్ పర్యవేక్షణలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. వర్షం కారణంగా స్వామివారి వెండిరథసేవను నిలుపుదల చేసి ఆలయంలో పల్లకీలో ప్రాకారసేవ నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సత్యదేవా జూనియర్ కళాశాలలో సత్యదేవుడి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. స్వామివారి విశిష్టతను విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఘంటశాల వెంకట్ తెలిపారు.

మంత్రి అచ్చెన్న పూజలు

శనివారం సత్యదేవుడి సన్నిధిలో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందించగా చైర్మన్ స్వామివారి ప్రసాదం అందజేశారు.


ఆలయంలో మంత్రి అచ్చెన్న

మద్యం కేసులో నిందితులు ఎంత పెద్దవారైనా
చట్టం వదిలిపెట్టదు

ప్రతిపక్ష హోదా కూడా లభించని నాయకుడా విమర్శించేది : మంత్రి జనార్దనరెడ్డి


గోపాలపురంలో మాట్లాడుతున్న మంత్రి

రావులపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో మిథున్‌రెడ్డిని అరెస్టు చేస్తే వైసీపీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారు. మద్యం కేసులో నిందితులు ఎంత పెద్దవారైనా చట్టం వదిలిపెట్టదు. చట్టం అందరికీ సమానమేనని ఆర్‌అండ్‌బీ, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖామంత్రి బీసీ జనార్దనరెడ్డి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ, శంకుస్థాపన కార్యక్రమాల్లో మంత్రి జనార్ధనరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. రూ.4వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో వైసీపీ నాయకులు జైలులో మగ్గుతున్నారన్నారు. మద్యం కేసులో సిట్ దర్యాప్తు జరుగుతున్న కారణంగా ఎక్కువ మాట్లాడదలుచుకోలేదన్నారు. దేశ చరిత్రలోనే ప్రతిపక్ష హోదా కూడా లభించని నాయకుడికి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన తప్పుడు కేసులపై విచారణ జరిపించి వారికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. వైసీపీ నాయకులు ఇంటింటికి తిరుగుతామంటున్నారని, గత ఐదేళ్ల పాలనలో వారు చేసిన అరాచకాలు, అక్రమాలను ప్రజల కు చెప్పుకోవడానికా అని ప్రశ్నించారు. ప్రజలు ఛీ కొట్టినా ఇంకా తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలతో వైసీపీ నాయకులు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. వైసీపీ పాలనలో ఇసుక దోపిడీ చేసి ఆ సొమ్మును తాడేపల్లి ప్యాలస్‌కు తరలించలేదా అని ప్రశ్నించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఒక్క గోపాలపురంలోనే రూ.5 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ పరదాల చాటున దాక్కుని తాడేపల్లి ప్యాలస్‌లో కూర్చుని బటన్లు నొక్కే పాలన కాదని, నిరంతరం ప్రజాసమస్యలు తెలుసుకుంటూ అభివృద్ధికి సంక్షేమానికి బాటలు వేస్తూ సుపరిపాలన అందించడమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, బీజేపీ నాయకులు అయినవిల్లి సత్తిబాబుగౌడ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మరణిస్తున్నానని మెసేజ్!

గోదావరిలో యువకుడి ఆచూకీ కోసం గాలింపు


ఏటిగట్టు వద్ద పోలీసు, రెవెన్యూ, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది


గోదావరిలో గాలింపు దృశ్యం

కె.గంగవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం భీమక్రోసుపాలెనికి చెందిన కలిదిండి చంద్రశేఖర్(27) శుక్రవారం చనిపోతున్నానని... సుందరపల్లి వద్ద తన మోటార్‌సైకిల్, ఫోన్ వదిలి వెళ్లిపోతున్నానని తన మిత్రులకు మెసేజ్ పెట్టి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి చంద్రశేఖర్ కనిపించలేదు. గోదావరిలో దూకి ఉంటాడని శనివారం ఉదయం నుంచి పామర్రు ఎస్‌ఐ ఎస్‌కె జానీబాషా, తహశీల్దార్ శ్రీరామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలింపు చేపట్టారు. రాత్రి వరకూ గాలింపు జరిగినా ఆచూకీ లభ్యం కాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మూగజీవాల అక్రమ తరలింపు అడ్డగింత

గోశాలకు 20 ఆవులు, 36 దూడలు
పోలీసుల అదుపులో డ్రైవర్

రాజానగరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నుంచి హనుమాన్ జంక్షన్‌కు ఆవులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని మార్గమధ్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ నాగార్జున సిబ్బందితో కలిసి జాతీయ రహదారిపై జీఎస్‌ఎల్ జనరల్ ఆసుపత్రి సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో పోలీసులను చూసిన పశువుల తరలిస్తున్న వ్యాన్ డ్రైవర్ పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుకుని వ్యాన్ పరిశీలించారు. వాహనంలో 20 ఆవులు, 36 ఆవు దూడలను ఏవిధమైన బిల్లులు లేకుండా తరలిస్తున్నట్టు గుర్తించారు. డాక్టర్ సర్టిఫికెట్లు గానీ, తగు జాగ్రత్తలు గానీ పాటించలేదన్నారు. పశువులను పార్వతీపురం నుంచి హనుమాన్ జంక్షన్‌కు తరలిస్తున్నట్టుగా డ్రైవర్ చెప్పాడన్నారు. పట్టుబడిన పశువులను గోశాలకు తరలించారు. వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఫేస్‌బుక్ పరిచయం... రూ.14.95 లక్షలు మాయం..

ధనవంతుడిని చేస్తానని మోసం చేసిన యువతి
పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

రాజానగరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ధనవంతుడిని చేస్తానని ఓ అమ్మాయి పలికిన మాయమాటల వలపుల వలలో చిక్కుకుని వ్యక్తి నిలువునా మోసపోయాడు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నం గ్రామానికి చెందిన కొల్లం బాబుకు ఓ అమ్మాయి ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైంది. ఆమెతో వాట్సాప్‌లో చాటింగ్ చేయడం ప్రారంభించాడు. బాబును ధనవంతుడిని చేస్తానని ఆశచూపింది. ఆ తర్వాత ఆమె కొన్ని బ్యాంకు ఖాతాల నెంబర్లు ఇచ్చి సొమ్మును వాటికి ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్ ఫర్ చేయమని చెప్పింది. ఈ విధంగా తొలుత రూ.50 వేలు ఫోన్ పే ద్వారా ఆమెకు పంపిన బాబు. దఫదఫాలుగా రూ.14,95,135ను ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేశాడు. బాబు సొమ్మును ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేసిన వెంటనే ట్రేడింగ్ ఖాతాలో బాధితుడికి డాలర్ల రూపంలో 5903.57 క్రెడిట్ అయినట్టు చూపించేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ సొమ్మును విత్‌డ్రా చేసి తన ఖాతాకు వేయమని తిరిగి బాబు అడగ్గా తన ఎక్కౌంట్ ఫ్రీజ్ అయ్యిందని, మరో రూ.20 లక్షలు చెల్లించమని చెప్పిన ఆమె ఆ తర్వాత ఆ వ్యక్తి నెంబరు బ్లాక్ చేసింది. దీంతో తనను నమ్మించి మోసం చేసినట్టుగా గుర్తించిన బాబు తనకు న్యాయం చేయాలంటూ రాజానగరం పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నాగార్జున తెలిపారు.

ఏపీ శాసన గిరిజన సంక్షేమ కమిటీ చైర్మన్‌గా రంప ఎమ్మెల్యే శిరీష

12మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసిన స్పీకర్ అయ్యన్న


ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ శాసనసభ-శాసన మండలిలకు సంబంధించి సంయుక్త గిరిజన సంక్షేమ కమిటీ చైర్మన్‌గా రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి నియమితులయ్యారు. ఈ మేరకు శాసనసభ స్పీకర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర శాసన సంబంధ వ్యవహారాల్లో భాగంగా పలు రంగాలకు సంబంధించి సంయుక్త కమిటీలను నియమించడం పరిపాటి. రంపచోడవరం నియోజకవర్గం నుంచి తొలిసారి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవికి చైర్మన్‌గా శాసనసభ స్పీకర్ అవకాశం కల్పించారు. ఆమెతో పాటు గిరిజన ఎమ్మెల్యేలు, మరో ముగ్గురు ఎమ్మెల్సీలు సభ్యులుగా నియమితులయ్యారు. రంపచోడవరం నియోజకవర్గం నుంచి శిరీషతోపాటు వైసీపీ ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్‌ను కూడా ఈ కమిటీలో సభ్యుడిగా నియమించారు. ఇంచు మించు 2 దశాబ్దాల అనంతరం రంపచోడవరం నియోజకవర్గానికి ఎస్టీ కమిటీ చైర్మన్‌గా అవకాశం దక్కింది. గతంలో శీతంశెట్టి వెంకటేశ్వరరావుకు కూడా టీడీపీ ప్రభుత్వం ఎస్టీ కమిటీ చైర్మన్‌గా అవకాశాన్ని ఇచ్చింది. ఆయన తర్వాత మళ్లీ ఇప్పుడు ఈ అవకాశం శిరీషకు దక్కింది. ఈ శాసనసభా కమిటీ రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సంక్షేమ కార్యక్రమాలపై పరిశీలన, ఇతర రాష్ట్రాల్లో అమలయ్యే గిరిజన సంక్షేమ కార్యక్రమాలపరిశీలన సాగించి ప్రభుత్వానికి నివేదికలను ఇస్తుంది. శిరీష నియామకం పట్ల రంప మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూ రమేష్ హర్షం వ్యక్తం చేశారు.

అల్లూరి కలెక్టర్‌కు జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసు

గిరిజన చట్టాల అమలులో అధికారుల నిర్లక్ష్యం
మెటల్ క్వారీపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఫిర్యాదుతో సంజాయిషీ కోరిన కమిషన్

రంపచోడవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం మన్యంలో గిరిజన చట్టాల అమలులో రంపచోడవరంలోని ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదుపై జాతీయ ఎస్టీ కమిషన్ అల్లూరి జిల్లా కలెక్టర్‌కు నోటీసు జారీ చేసింది. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను శనివారం మీడియాకు విడుదల చేసిన ప్రకటన ప్రకారం పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. రంపచోడవరం మండలం నరసాపురంలో నడుస్తున్న మెటల్ క్వారీ చట్ట విరుద్ధమని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి, రంపచోడవరం సబ్ కలెక్టర్‌కు అనేక ఫిర్యాదులు చేశామని, ప్రాజెక్టు అధికారి స్పందిస్తూ సబ్ కలెక్టర్‌కు తగు ఆదేశాలను ఇచ్చామని చెప్పారని, అయినా చర్యలు లేకపోవడంతో తాము జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. తమ ఫిర్యాదును స్వీకరించిన కమిషన్ అల్లూరి జిల్లా కలెక్టర్ నుంచి సంజాయిషీ కోరుతూ నోటీసు జారీ చేసిందన్నారు. ఇకపై అధికారులు చట్టాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, ప్రతి అంశాన్నీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాల మూసివేత

అధిక వర్షాల కారణంగా నిర్ణయం : ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం


మాట్లాడుతున్న పీవో

రంపచోడవరం/మారేడుమిల్లి, జూలై 26 (ఆంధ్ర జ్యోతి): అధిక వర్షాల కారణంగా ఏజెన్సీలోని పలు పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ప్రజలు వాగులు దాటే ప్రయత్నాలు చేయవద్దని సూచించారు. అన్ని పర్యాటక ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వారంతపు సెలవులు కావడంతో ఈ ప్రాంతానికి పర్యాటకులు అధికంగా వచ్చే అవకాశం ఉండడంతో పలు జలపాతాలు తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు తెలిపారు. మారేడుమిల్లి మండలంలోని గుడిసె, చావడికోట, జలతరంగిణి, అమృతధార, దుంపవలస, వలస జలపాతాలను మూసివేశామన్నారు. ఆయా జలపాతాల వద్ద రెవెన్యూ, పోలీస్ అధికారులు నిఘా ఉంచి పర్యాటకులకు ఎవరూ అటు వైపు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో సింహాచలం ఆదేశించారు.

అల్లవరంలో హడలు!

కొబ్బరి రాశుల్లో ఐదు అడుగుల భారీ తాచుపాము



అల్లవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం కొబ్బరి తోటలో శనివారం 5 అడుగుల తెల్ల తాచుపాము హడలెత్తించింది. కొబ్బరికాయలు ఒలుస్తుండగా కార్మికులు తాచుపామును చూసి భయాందోళనకు గురయ్యారు. స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించారు. వర్మ పామును బంధించి సురక్షిత ప్రాంతంలో వదిలిపెట్టాడు. కొబ్బరికాయల రాశుల్లో ఎలుకలు, కప్పలను తినడానికి పాములు వస్తాయని వర్మ తెలిపాడు.

దళితుడిపై దాడి కేసులో మరో ఇద్దరి అరెస్టు

అమలాపురం డీఎస్పీ

అమలాపురం టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): దళితుడిపై అమానుషంగా దాడి చేసిన కేసులో మరో ఇద్దరు నిందితులను శనివారం అరెస్టు చేసినట్టు అమలాపురం డీఎస్పీ టీఎస్‌ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఇప్పటికే ఈ కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని ఆయన తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం వెలువలపల్లి గ్రామానికి చెందిన దోనిపాటి మహేశ్వరరావు అలియాస్ మహేష్ రావులపాలెం శ్రీశాంతి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. దళితుడైన మహేశ్వరరావుపై ఈనెల 19న పలు పర్యాయాలు అమానుషంగా దాడి చేశారు. ఈ కేసుకు సంబంధించి అమలాపురం అశోక్‌నగర్‌కు చెందిన మల్లాడి సుదర్శన్, అల్లవరం మండలం కోడూరుపాడుకు చెందిన తోట నాగవెంకటసత్యనారాయణ అలియాస్ సతీష్‌ను అల్లవరం మండలం బోడసకుర్రు టిడ్కో గృహాల వద్ద అరెస్టు చేసి వారి వద్ద నుంచి మోటారు సైకిళ్లు, కీలకమైన ఆధారాలు ఉన్న మూడు సెల్‌ఫోన్లను, ఫిర్యాదు వద్ద నుంచి బలవంతంగా లాకున్న సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని కోర్టులో హాజరుపరచనున్నట్టు డీఎస్పీ తెలిపారు.

రామవరంలో పేకాడుతున్న 27 మంది అరెస్టు

రూ.86 వేల నగదు, 6 కార్లు, 18 మోటారు సైకిళ్లు స్వాధీనం

అనపర్తి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరంలో శనివారం రాత్రి ప్రత్యేక పోలీసుల ఆధ్వర్యంలో పేకాట శిబిరంపై దాడులు చేసి 27 మందిని అరెస్టు చేశారు. శ్రీను నాయక్ వివరాల ప్రకారం.. తమకు వచ్చిన సమాచారం మేరకు రామవరం-రాయవరం రోడ్డులో దాడులు నిర్వహించి పేకాడుతున్న 27మందిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.86,960 నగదు, 18 మోటారుసైకిళ్లు, 6 కార్లు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుచనున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ దాడుల్లో స్పెషల్ పార్టీ పోలీసులతో బాటు, సీఐ సుమంత్, ఏఎస్‌ఐ దుర్గాప్రసాద్, ట్రైనీ ఎస్‌ఐ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడలో మత్స్యకారుల ఆందోళన

మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని బైఠాయింపు


ఆందోళన చేస్తున్న మత్స్యకార మహిళలు

కాకినాడ క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల వద్ద శుక్రవారం ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మహిళలు, ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్ మార్చురీ తరలించగా శనివారం వార్పు రోడ్డులో జగన్నాథపురం వంతెన వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రమాదంలో మృతి చెందిన మత్స్యకారుల కుటుంబీకులు ఆందోళన బాట పట్టారు. జగన్నాథపురం కొత్తవంతెన, పాత వంతెనలపై మృతుల కుటుంబీకులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ట్రావెల్స్ యాజమాన్యం ఒక్కో బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుమారు 15 వందల మంది మత్స్యకారులు ఆందోళన పాల్గొన్నారు. మత్స్యకార పెద్దలు, ట్రావెల్స్ యాజమాన్యంతో జరిగిన చర్చల నేపథ్యంలో మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం తరలించి అంతిమసంస్కారాలు శనివారం నిర్వహించారు.

భారీ వాహనాలకు బ్రేక్!

దిండి-చించినాడ వంతెనపై ప్రయాణికులకు ఇబ్బందులు

మలికిపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దిండి-చించినాడ వంతెనపై భారీ వాహనాలను నిలుపుదల చేయడంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాజోలు దీవిలో అత్యధిక శాతం విద్యార్థులు పశ్చిమగోదావరి జిల్లాలోనే విద్యను అభ్యసిస్తున్నారు. వీరందరికీ దిండి వంతెనపై భారీ వాహనాల రాకపోకల నిషేధం ఇబ్బందిగా మారింది. బస్సులపై దిండి వంతెన వరకు వెళ్లి అక్కడి నుంచి ఆటోపై ప్రయాణాలు చేస్తున్నారు. హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తమ లగేజీతో దిండి వంతెన నుంచి అవతలకు వెళ్లి బస్సులు ఎక్కుతున్నారు. ఇరువైపులా భారీ వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటుచేశారు. పోలీసు సిబ్బంది గస్తీ కాస్తున్నారు. దిండి వంతెన మరమ్మతులకు ఎప్పుడు ప్రారంభిస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు. మరమ్మతులు వెంటనే చేపట్టాలని వారు కోరుతున్నారు.


దిండి వంతెన వద్ద ఆగిపోయిన స్కూల్ బస్సులు

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం



యానాం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): యానాం గౌతమి గోదావరిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. శనివారం సాయంత్రం గోదావరి ఒడ్డన ఉన్న నావల పక్క న మృతదేహాన్ని గుర్తించారు. వయస్సు 30 ఏళ్ల ఉంటుందని, మృతదేహంపై పచ్చరంగు టీషర్టు, నిక్కరు ఉన్నాయి. యూనియన్ బ్యాంక్ ఏటీఎం కార్డు గుర్తించారు. మృతదేహాన్ని పోలీసులు యానాం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసినవారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రామవరంలో చోరీ


చిందరవందరగా ఉన్న ఇంట్లోని వస్తువులు

జగ్గంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరంలో మేక వీరబాబు ఇంట్లో చోరీ జరిగింది. కుటుంబంతో కలిసి శుభకార్యానికి వెళ్లి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలకొట్టి రూ.89వేల నగదు, 80తులాల వెండి, బంగారం చెవిదిద్దులు చోరీకి గురైనట్టు మేక వీరబాబు జగ్గంపేట పోలీసుకు ఫిర్యాదు చేసినట్టు తెలిపాడు.

వ్యభిచార గృహంపై దాడి

జగ్గంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట శ్రీరామ్‌నగర్‌లో ఓ ఇంట్లో రహస్యంగా నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై పోలీసులు శనివారం దాడి చేశారు. మహిళతోపాటు గృహాన్ని నడుపుతున్న యజమాని కాంతమ్మ, ఇద్దరు విటులను పోలీసులు అరెస్ట్ చేసినట్టు సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. విటులు, కాంతమ్మపై కేసు నమోదు చేశారు. వ్యభిచారం చేస్తున్న మహిళను ఐసీడీఎస్ సిబ్బందికి అప్పగించారు. వారు ఆమెకు కౌన్సిలింగ్ నిర్వహించి బంధువులకు అప్పగించారు.

విద్యుత్ షాక్‌తో రెండు తాడిపెద్దులు మృతి

తునిరూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మార్కెట్ యార్డులో శనివారం విద్యుత్ తీగ తెగిపడడంతో రెండు తాడి పెద్దులు అక్కడికక్కడే మృతిచెందాయి. ఈ సంఘటనను ప్రత్యక్షంగా చూసిన వ్యాపారులు, కొనుగోలుదారులు భయంతో పరుగులు తీశారు. విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేయగా సరఫరాను నిలుపుదల చేయించారు. మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చారు.


తునిలో మృతిచెందిన తాడిపెద్ది

తూనికలు, కొలతలశాఖ అధికారుల తనిఖీలు

కాట్రేనికోన, జూలై26(ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతలశాఖ అధికారి వీఏస్‌వీఎస్ మోహన్ ఆధ్వర్యంలో శనివారం కాట్రేనికోన వారపు సంతలో దుకాణాలను తనిఖీ చేశారు. కొన్ని దుకాణాలపై కేసులు నమోదు చేశారు. కాటాలకు సీళ్ల వేయించుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

రెడ్ బ్యాడ్జీలు ధరించి నిరసన

అమలాపురంరూరల్,జూలై 26(ఆంధ్రజ్యోతి): విజయవాడ గవర్నర్‌పేట,పాతబస్టాండుస్థలాలను లూలూ మాల్ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టాలన్న నిర్ణయాన్ని నిరసిస్తూ నేషనల్ మజ్దూర్‌యూనిటీ ఆధ్వర్యంలో అమలాపురం,రాజోలు, రావులపాలెం, రామచంద్రపురం డిపోల్లో నిరసన ప్రదర్శన చేపట్టినట్టు జిల్లాకమిటీ ప్రతినిధి రాంబాబు తెలిపారు

రూ.కోటితో ప్రభుత్వాసుపత్రుల అభివృద్ధి: ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరంలో సామాజిక ఆసుపత్రితో పాటు ప్రాథమిక ఆసుపత్రుల్లో అధునాతన పరికరాలతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ఓఎన్జీసీ నుంచి రూ.కోటి నిధులు తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. పి.గన్నవరం సీహెచ్‌సీలో అబ్దుల్‌కలామ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించి అనంతరం మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రహదారితో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తానన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సిబ్బంది, వైద్యులపై చర్యలు తప్పవన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో అబ్దుల్‌కలామ్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యుడు, రాజకీయ నాయకుడు తాడి తాతారావు జ్ఞాపకార్థం రూ.7.50 లక్షలతో ఏర్పాటుచేసిన భోజన శాలను, కె.ఏనుగుపల్లికి చెందిన సూదా ప్రకాశరావు తన కుమారులు అంజిబాబు, రాంబాబు జ్ఞాప కార్థం రూ.2.50లక్షలతో ఏర్పాటుచేసిన విశ్రాంతి భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అబ్దుల్‌కలామ్ విగ్రహాన్ని ప్రారంభించారు. స్థానికుడు గణపతి తాతాజీ రూ.38వేలతో సమకూర్చిన ఏసీని ఎమ్మెల్యే ఆసుపత్రికి అందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రరావు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, చొల్లంగి సత్యనారాయణమూర్తి, సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకటసత్యనా రాయణ, గణపతి వీరరాఘవులు, కోట రాజేంద్రప్రసాద్, గుడాల సంపదరావు, శేరు శ్రీనుబాబు, ద్రైవాల రాంబాబు, ఆరుమిల్లి సాయిబాబు, కె.సత్యనారాయణరాజు, ట్రస్టసభ్యులు ఆరుమిల్లి వీరవెంకట రామకృష్ణ, గూటం శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పి.గన్నవరంలో అబ్దుల్‌కలామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

సమస్యలు పరిష్కారం కాని సమావేశాలెందుకు!

● మండల సమావేశంలో పలువురు సభ్యుల అసంతృప్తి

ముమ్మిడివరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): సమావేశాల్లో సమస్యలు పరిష్కరించే దిశగా ఉండాలి. చర్చకు తీసుకువచ్చిన సమస్య పరిష్కారానికి నోచుకోకపోతే ఇక సమావేశాలకు వచ్చి ఏం ప్రయోజనమని సర్పంచ్ మోకా రామారావుతో పాటు పలువురు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ముమ్మిడివరం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ కోలా గంగాభవానీ అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. అయినాపురం సర్పంచ్ మోకా రామారావు మాట్లాడుతూ మరో ఎనిమిది నెలల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగయనుంది, గ్రామాల్లో ప్రజల సమస్యలు పరిష్కరించలేకపోయాం. సమావేశాల్లో పలుసార్లు చర్చకు తీసుకువచ్చిన సమస్యలు కూడా పరిష్కారం కాలేదని ఆయన తో పాటు పలువురు సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఏ పనులు జరిగినా సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వడంలేదు, అయినాపురంలో ఇంటింటికీ కుళాయి ప్రారంభోత్సవ కార్యక్రమం సర్పంచ్ అయిన తనకు సమాచారం లేదని ఆయన అసంతృప్తిని వెళ్లగక్కారు. ఎంపీపీ నిధుల కేటాయింపులో కూడా వివక్షత చూపుతున్నారని ఎంపీపీ వైఖరిని తప్పుపట్టారు. మండల విద్యాశాఖాధికారి డి.గౌరీశంకర్, ఆ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు వివరించారు. తల్లికి వందనం పథకం డబ్బులు అందరికీ పడలేదని వైస్‌ఎంపీపీ మట్టపర్తి సురేష్ ఎంఈవోను నిలదీశారు. బ్యాంకు ఖాతాకు లింకు అవ్వడంలో లోపం ఉండడం వల్ల కొంత మందికి సొమ్ములు పడలేదని, వారి వివరాలు తమకు ఇస్తే వాటిని పరిష్కరిస్తామని ఎంఈవో వివరించారు. మండల వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ తమశాఖ ద్వారా అమలవుతున్న పథకాలను వివరించారు. రబీ ధాన్యం సొమ్ము రైతులకు ఇంకా పడలేదని, ఖరీఫ్ నాట్లు వేసే సమయానికి కూడాధాన్యం సొమ్ములు చెల్లించకపోతే ఎలా అని వైస్ ఎంపీపీ సురేష్, ఎంపీపీ కోలా గంగాభవానీలు ఏవోను ప్రశ్నించారు. దీనిపై ఏవో స్పందించి 95శాతం మంది రైతులకు ధాన్యం సొమ్ములు చెల్లించామని, సాంకేతిక లోపాల కారణంగా కొంతమందికి సొమ్ములు పడకపోయి ఉండవచ్చని, త్వరలోనే అవి కూడా చెల్లిస్తామన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది కొంతమందికి ఈక్రాప్ నమోదు చేయకపోవడం వల్ల ధాన్యంవిక్రయించుకోవడంలో నష్టపోతున్నారని, అందరికీ ఈక్రాప్ నమోదయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని జడ్పీటీసీ కుడుపూడి శంకరరావు సూచించారు. సీడీపీవో ఎం.నిహారిక మాట్లాడుతూ గ్రామాల్లో బాలల సంరక్షణ, పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేసి బాలల సంరక్షణ విషయంలో బాధ్యత తీసుకోవాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. అనాతవరానికి మంజూరైన నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే ఏర్పాటుచేయాలని సర్పంచ్ మిమ్మితి చిరంజీవి విద్యుత్‌శాఖ ఏఈకి సూచించారు. ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావడం వల్ల అవి పూర్తిస్థాయిలో సత్ఫలితాలిస్తాయన్నారు. ఆగస్టు 1న వితంతువులకు కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. ఎంపీపీ కోలా గంగాభవానీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సహకారంతో పనిచేస్తూ గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో కేవలం ఐదు శాఖల అధికారులతో మాత్రమే చర్చ జరిగింది. సమావేశం ఆలస్యంగా మొదలు కావడంతో మధ్యాహ్నం ఒంటి గంట అయ్యేసరికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఒక్కొక్కరిగా సమావేశం నుంచి వెళ్లిపోవడంతో చర్చను ఐదు శాఖలతో సరిపెట్టి ముగించారు. సమావేశంలో పంచాయతీరాజ్ డీఈఈ పాలకొల్లు విజయశ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కె.నానాజీరావు, డిప్యూటీ తహసీల్దార్ గోపాలకృష్ణ, వైస్ ఎంపీపీ పాము నాగమణి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మట్టపర్తి సత్యనారాయణ, మండల పరిపాలనాధికారి టీఎస్‌వేషగిరిరావు, ఈవోపీఆర్డీ సీహెచ్ లక్ష్మీకల్యాణి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ కోలా గంగాభవానీ

దళితుడిపై దాడి కేసులో నిందితులను అరెస్టుచేయాలి



దాడిని నిరసిస్తూ దళితుల ఆందోళన

అమలాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): దళిత యువకుడు దోనిపాటి మహేష్‌కుమార్‌పై దాడిచేసిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేస్తూ అమలాపురం కలెక్టర్ కార్యాలయం ఎదుట శనివారం వివిధ రాజకీయ పార్టీలు, దళిత ప్రజాసంఘాలు ధర్నా నిర్వహించాయి. ఈధర్నాలో డీహెచ్‌పీఎస్, కేవీపీఎస్, వీసీకే పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు. దోనిపాటి మహేష్‌పై దాడిచేసిన అసలైన దోషులను అరెస్టుచేయాలని డిమాండ్‌చేశారు. దళిత హక్కులు, పోరాట సమితి, కులవివక్ష వ్యతిరేక పోరాట సమితితో పాటు ప్రజా సంఘాల నాయకులు ధర్నాలో పాల్గొన్నారు. దాడికి కారణమైన వ్యక్తులు కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ అనుచరులని, వారిలో రాయల్ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తుల విజయ్‌కుమార్‌ను ఏ-1గాచేసి కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని నినాదాలిచ్చారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. డీహెచ్‌పీఎస్ గౌరవాధ్యక్షుడు దేవ రాజేంద్రప్రసాద్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎ.మాల్యాద్రి, వీసీకే రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రజా సంఘాల నాయకులు కారెం వెంకటేశ్వరరావు, బొంతు రమణ, దుర్గాప్రసాద్, మల్లెల ఆనంద్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును ఆధునికీకరించాలని వినతి

మామిడికుదురు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు నుంచి గన్నేరుపుంతకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైందని, దానిని ఆధునికీకరించాలంటూ స్థానికులు శనివారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. రెండు కిలోమీటర్ల మేర రోడ్డు గోతులు పడి అధ్వానంగా తయారైందని, వర్షాకాలం వస్తే ఆ గోతుల్లో నీరుచేరి బురదమయమై ప్రమాదాలకు నిలయంగామారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

అధిక దిగుబడులకు మేలైన విత్తన ఎంపికే మార్గం

ఉప్పలగుప్తం, జూలై 26(ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడుల సాధన మేలైన విత్తన ఎంపిక పైనే ఆధారపడి ఉంటుందని వరి ప్రధాన శాస్త్రవేత్త ఎం.గిరిజారాణి అన్నారు. సార్వా సాగు విషయంలో రైతులు పాటించవలసిన ఉత్తమ యాజమాన్య పద్ధతులపై ఆమె రైతులతో చర్చించారు. శనివారం డాట్ కో ఆర్డినేటర్ ఎం.నందకిశోర్‌తో కలిసి గొల్లవిల్లి అరిగెల వీరబ్రహ్మాజీ పొలంలో వరి నారుమళ్లను పరిశీలించారు. సార్వాలో ముంపు తట్టుకునే, పడిపోని రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి గుత్తుల కుమార్‌బాబు, వ్యవసాయ విస్తరణాధికారి కె.ఆదిత్య, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ నిరసన

ముమ్మిడివరం, జూలై26(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం ముమ్మిడివరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. జిల్లాలోని యూటీఎఫ్‌శాఖ ఉపాధ్యాయులంతా ముమ్మిడివరం చేరుకుని డీఈవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. అనంతరం వినతిపత్రాన్ని డీఈవో కార్యాలయంలో అందజేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎంటీవీ సుబ్బారావు, కార్యదర్శి వి.సురేంద్రకుమార్, జీహెచ్‌ఎం అసోసియేషన్ అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు, యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, సహ అధ్యక్షుడు జీవీ రమణ, జి.సీతాదేవి, జిల్లా కార్యదర్శి టి.దుర్గాప్రసాద్, శ్రీనివాస్‌లతో పాటు జిల్లాలోని యూటీఎఫ్ సంఘాల అధ్యక్షులు, మండల కార్యదర్శులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బుద్ధునితో నా ప్రయాణం నాటకం



నాటకంలోని కీలక సన్నివేశం

అమలాపురం రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): అభ్యుదయ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో అమలాపురం కిమ్స్ ఆసుపత్రి ఆడిటోరియంలో బుద్ధునితో నా ప్రయాణం డాక్టర్ అంబేడ్కర్ నాటకం ఆహుతలందరినీ ఎంతగానో ఆకట్టుకుంది. కిమ్స్ విద్యా సంస్థల అధినేత కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) జ్యోతి ప్రజ్వలనతో నాటక ప్రదర్శనను శుక్రవారం రాత్రి ఆలస్యంగా ప్రారంభించారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి కిమ్స్ సూపరింటెండెంట్ పి.సుబ్బారావు, సీనియర్ దమ్మ బోధకులు, జిల్లా అధ్యక్షుడు కాశి రాంబోధి బుద్ధవందనం చేశారు. అనంతరం బుద్ధునితో నా ప్రయాణం నాటక ప్రదర్శనలో అనేక కీలక అంశాలను ప్రదర్శించారు. ఉత్కంఠ భరితంగా అనేక సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. సంగీత సాహిత్యాలు అలరించాయి. నాటక ప్రదర్శనదారులను బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీబీ లోక్, కార్యదర్శి ములపర్తి సత్యనారాయణ, రచయిత సవేరా, పులిదిండి నాగేశ్వరరావు, పెట్టా వెంకట్రావు, కోలా త్రిమూర్తులు, సాకా రాజారావు, కవల రమేష్, నక్కా శ్రీనివాస్, వాకపల్లి భీమారావు, మాగాపు ఈశ్వరరావు, ఉప్పే సత్యనారాయణ, వడ్డి సత్యనారాయణ, జల్లి రంగారావు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకిన స్కూల్ బస్సు



అంతర్వేది,జూలై 26 (ఆంధ్రజ్యోతి): అప్పనరామునిలంకలో 40మంది విద్యార్థులతో ప్రయాణిస్తున్న స్కూలు బస్సు విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ ఉన్న స్తంభానికి రాసుకుని వెళ్లింది. అప్రమత్తమై విద్యుత్ సరఫరా ను నిలుపుదల చేయడంలో భారీ ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఇటువంటి సంఘనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారికి ప్రిన్సిపాల్ స్వామి హామీ ఇచ్చారు.

గనికమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

అమలాపురం టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): అమలాపురం వంటెద్దువారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీగనికమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో చండీ హోమం జరిపించారు.

ప్రకృతి వ్యవసాయంలో ప్రతీరైతు భాగస్వామికావాలి

అమలాపురం రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో ప్రతీ రైతు భాగస్వామి అయ్యేలా కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు సూచించారు. అమలాపురం డివిజన్ పరిధిలోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లకు స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని బోసుబాబు ప్రారంభించి మాట్లాడారు. భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి, భూసారాన్ని కాపాడుకునేందుకు ప్రకృతి వ్యవసాయమే శరణ్యమని ఆయన తెలిపారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీఎండీఎస్ ఉపయోగాలను రైతులకు వివరించారు. ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవడంతో పాటు ప్రకృతి వ్యవసాయంతో ఖర్చులను తగ్గించుకోవచ్చునని వివరించారు. వరిచేల గట్లను విస్తరించి కూరగాయలు పెండచం ద్వారా పురుగు మందల అవశేషాలులేని ఆహార ఉత్పత్తులను ప్రజలకు అందించవచ్చునన్నారు.కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ హేమలత, వైపీ శ్రీనివాస్, సూరిబాబు, నాగవేణి, శ్రీనివాస్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మడ అడవుల సంరక్షణ అందరి బాధ్యత

కాట్రేనికోన, జూలై 26(ఆంధ్రజ్యోతి): మడ అడవుల సంరక్షణ అందరి బాధ్యతని ఎఫ్ఆర్వో జి.ఈశ్వరరావు అన్నారు. కందికుప్ప లైట్ హౌస్ ప్రాంతంలో అంతర్జాతీయ మడ అడవులు పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శనివారం వన సంరక్షణ సమితి సభ్యుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. జిల్లా అటవీశాఖాధికారి ఎంవీ ప్రసాదరావు పర్యవేక్షణలో ఈకార్యక్రమం నిర్వహించారు. నదీ జలాలు సముద్రంలో కలిసే చోటచిత్తడి నేలల్లో చెట్లు పెరుగుతాయని కందికుప్ప డిప్యూటీ రేంజ్ అధికారి బి.నాగసత్యనారాయణ అన్నారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్ ఎం.సత్యసాయిబాబా, శ్రీనివాస్, డీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్



కాగడాలు ప్రదర్శిస్తున్న బీజేపీ నాయకులు

అమలాపురం,జూలై26(ఆంధ్రజ్యోతి): అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో శనివారం జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్‌దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా మాట్లాడారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అమరులకు నివాళులర్పించి వారిత్యాగాలను స్మరించుకున్నారు. బీజేపీ జిల్లా నాయకులు చీకురుమెల్లి శ్రీనివాసరావు, గనిశెట్టి వెంకటేశ్వరరావు, చిలకమర్రి కస్తూరి, అడపా శ్రీనివాసరావు, మోకా వెంకటసుబ్బారావు, కొండేటి ఈశ్వర్‌గౌడ్, బొంతు శివాజీ, పేరూరి వెంకటేశ్వరరావు, తటవర్తి వెంకటసుబ్బారావు, దాట్ల వెంకటసుబ్బరాజు, కె.శివాజీ, కర్రి తాతారావు, చెరుకూరి గోపాలకృష్ణ, అయ్యల భాస్కరరావు, అరిగెల బాబి, చిలకమర్రి సాగర్, అధిక సంఖ్యలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. కాగడాలతో ప్రదర్శన నిర్వహించి అమరులైన సైనికులకు నివాళులర్పించారు.

ఘనంగా తిరునక్షత్ర పూజలు

అంతర్వేది, జూలై 26(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం మొదటిరోజు శ్రీఆండాళ్ వర్ష తిరునక్షత్ర పూజలు నిర్వహించారు. తొలుత ప్రత్యేక సింహాసనంపై స్వామి-అమ్మవార్లను ఆశీనులుచేసి అలంకరించారు.

డీసీ ఛైర్మన్ శ్రీనివాస్‌కు మాతృ వియోగం



కాట్రేనికోన, జూలై 26(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన నీటి పంపిణీ సంఘం ఛైర్మన్ ఆకాశం శ్రీనివాస్ తల్లి శాంతమ్మ శనివారం మృతి చెందారు. ఆమె భర్త చిట్టిబాబు భీమనపల్లి, ముమ్మిడివరం సమితి అధ్యక్షులుగా, ముమ్మిడివరం ల్యాండ్ మార్టేజ్ బ్యాంకు ఛైర్మన్‌గా, కందికుప్ప పీఏసీఎస్ ఛైర్మన్‌గా, సర్పంచ్‌గా పనిచేశారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానందర, తూర్పుడెల్టా మాజీ ఛైర్మన్ యేడిద చక్రపాణిరావు, సొసైటీ ఛైర్మన్లు నూకల మూర్తి, గంగుమళ్ళ రవికుమార్, త్సవటపల్లి శ్రీనివాస్, మార్గదర్శి త్సవటపల్లి నాగు, నీటిసంఘం ఛైర్మన్ ఇసుకపట్ల వెంకటరమణ, మాజీ ఎంపీపీ ఆకాశం సత్యనారాయణమూర్తి పరామర్శించారు.

కూటమి పాలనలో రాష్ట్రాభివృద్ధి : ఎమ్మెల్యే దేవ



కాట్రేనిపాడులో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాజోలు, జూలై 26(ఆంధ్రజ్యోతి): కూటమి పరిపాలనలో రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. కాట్రేనిపాడు నుంచి పొన్నమండ వరకు నాబార్డు నిధులు రూ.1.28కోట్లతో 1.90 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ కాట్రేనిపాడులో ఇప్పటికే రూ.లక్షా 20వేలతో రోడ్డు శంకుస్థాపన చేశామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్లపై ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. మిగిలిన రోడ్లు త్వరలో పూర్తి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతున్నాయన్నారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, చాగంటి స్వామి, అడబాల చంటి, దిరిశాల బాలాజీ, సర్పంచ్ అడబాల శ్రీనివాసరావు, పినిశెట్టి బుజ్జి, మోకా పార్వతి పాల్గొన్నారు.

మంగళగిరి తరహాలో చేనేత శాలను ఏర్పాటుచేయాలి

అమలాపురం రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో చేనేత కార్మికుల ఉపాధి కోసం మంత్రి నారా లోకేశ్ చేనేతశాలను ఏర్పాటుచేసి విజయవంతంగా నడుపుతున్నారని, అదే తరహాలో రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలో అత్యధిక చేనేత కార్మికులు ఉన్న ఆదివారపుపేటలో చేనేతశాలను ఏర్పాటుచేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని లివరీ చేనేత సహకార సంఘాల ప్రతినిధులు చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖారాణికి విజ్ఞప్తి చేశారు. ఆప్కో మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన రేఖారాణిని అమరావతిలో మర్యాద పూర్వకంగా కలుసుకుని చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రేఖారాణిని అభినందించి సత్కరించారు. అనంతరం జనరల్ మేనేజర్ మైసూరు నాగేశ్వరరావును కలిసి చేనేత సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఫెడరేషన్ ఛైర్మన్ దొంతంశెట్టి సత్యప్రకాష్, శివల, అద్దంపల్లి, ముమ్మిడివరం, నల్లూరు, నేలటూరు, అంగర, దుగ్గాడ సహకార సంఘాలన ఉంచి సీహెచ్ వీర్రాజు, ఎస్.సుబ్రహ్మణ్యం, కోట రాజు, ఎస్.గురుమూర్తి, కొలువుల సుబ్బారావు, తమ్మ బసవన్న, కుమారస్వామి, అన్నాజీరావుతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

ముమ్మిడివరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ ఆరోపించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో శనివారం పార్టీ పట్టణ కన్వీనర్ బొంతు బుజ్జిబాబు అధ్యక్షతన జరిగిన మండల, అర్బన్‌స్థాయి బాబూష్యూరటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో పొన్నాడ మాట్లాడారు. నాయకులు పితానిబాలకృష్ణ, పార్టీ పరిశీలకుడు మతా మురళీ, పెన్మెత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకన్నకు రూ.50వేలు విరాళం

అంబాజీపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో ఉన్న శ్రీభూసమే శ్రీవేంకటేశ్వరస్వామి వారికి రంకిరెడ్డి పెదకాపు-పళ్లాలమ్మ జ్ఞాపకార్థంగా వారి కుమారుడు రంకిరెడ్డి వీరరాఘవులు (అబ్బులు) రూ.50,116 విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ ఛైర్మన్ మేడిద శ్రీనివాసరావుకు అందజేశారు. దాతను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి రూ.3.10కోట్లు అందజేత



యానాం, జూలై26(ఆంధ్రజ్యోతి): యానాంలో శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణం రెండో దశకు తిరుమల తిరుపతి దేవస్థానానికి రూ.3.10కోట్ల చెక్కును పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అందజేశారు. మల్లాడి తిరుపతి వెళ్లి టీటీడీ ఈవో శ్యామలరావును కలిసి చెక్కును అందజేశారు. ఈసందర్భంగా ఈవోతో మల్లాడి పలు విషయాలు చర్చించారు. ఇప్పటికే మొదటి దశ పనులు పూర్తి చేశామని, రెండో దశ పనులు త్వరితగతిన మొదలు పెట్టాలన్నారు. రెండో దశకు సంబంధించి రూ.3.10కోట్లతో పాటు మిగిలిన రూ.49లక్షలు రెండో దశ వర్క్ ఆర్డర్ ఇచ్చేనాటికి చెల్లిస్తామని ఈవోకు మల్లాడి తెలిపారు. ఆగస్టులో రెండో దశ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని టీటీడీ అధికారులు చెప్పారని మల్లాడి వివరించారు. పుదుచ్చేరి ప్రభుత్వం ఇచ్చిన రూ.2.75కోట్లతో కలిపి దాతలు ఇచ్చిన విరాళాలతో మొత్తం రూ.3.10కోట్ల చెక్కును టీటీడీ ఇచ్చామన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసనగేష్



అంతర్వేది, జూలై 26(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా టేకిశెట్టిపాలెనికి చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు మాలే శ్రీనివాసనగేష్ నియమితులయ్యారు. 1986లో పార్టీలో చేరిన నాటి నుంచి యువమోర్చా బాధ్యతలతో పాటు బీజేపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ వివిధ బాధ్యతలు చేపట్టానన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నగేష్ అన్నారు. సఖినేటిపల్లిలంకకు చెందిన పట్టాపు సూర్యప్రకాశరావును జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమించారు.

రీజనల్ కోఆర్డినేటర్‌గా నాయుడు



అమలాపురం టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏపీపీడీసీఎంఏ) ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాలో రీజనల్ కోఆర్డినేటర్‌గా అమలాపురం విద్యానిధి విద్యాసంస్థల అధినేత ఏబీ నాయుడు నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు జె.రమణాజీ ఈమేరకు శనివారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఉమ్మడి జిల్లాలోని అన్‌ఎయిడెడ్, డిగ్రీ కళాశాలల్లో సంస్థాగతంగా, పాలనాపరంగా, విద్యాపరంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఆయా విశ్వవిద్యాలయాల పరిధిలో కృషి చేస్తానని నాయుడు తెలిపారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా రానున్న రోజుల్లో డిగ్రీ స్థాయిలో వివిధ కొత్త కోర్సుల ప్రారంభానికి ప్రాతినిథ్యం చేయనున్నట్టు వెల్లడించారు. నాయుడు నియామకం పట్ల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రాజ్‌కుమార్‌చౌదరి, ఎండీ హబీబ్‌బాషా, కార్యదర్శి ఎన్.కనకయ్య, నాగబాబు, ప్రిన్సిపాల్స్ బి.సుబ్బారాయుడు,బి.సుధీర్‌బాబు తదితరులు హర్షం వ్యక్తంచేశారు.

మత్స్యకారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

కాట్రేనికోన, జూలై 26(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలు చేస్తున్నట్టు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపదయోజన, ప్రధానమంత్రి మత్స్యకిసాన్ సమృద్ధిసహయోజన పథకాల ప్రచారంలో భాగంగా మండలంలోని 27మత్స్యకార సంఘాలు, కుల సంఘాల పెద్దలతో శనివారం కాట్రేనికోనలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మత్స్యకారుల బోట్లను రిజిస్ట్రేషన్ చేసే విషయంలో అధికారులు శ్రద్ధ వహించాలని సూచించారు. నాగిడి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి పి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ వర్ధన్, ఎఫ్‌డీవో విశ్వ రమణారావు, పిప్పళ్ళ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన సేవలందించాలి

మామిడికుదురు, జూలై 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు నాణ్యమైన సేవలు అందించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆకాంక్షించారు. నగరం మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం ఛైర్‌పర్సన్ పెనుమాల లక్ష్మి అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ యార్డు ఆదాయం పెరిగేలా సభ్యులు కృషి చేయాలన్నారు. మార్కెట్‌యార్డులో నిర్మించనున్న సైకిల్ షెడ్డు ప్రదేశాన్ని పరిశీలించారు. పాలకవర్గ సభ్యులు, స్థానిక సర్పంచ్ జాలెం రమణకుమారి, ఏఎంసీ సెక్రటరీ జి.ప్రదీప్ పాల్గొన్నారు.

దళిత యువకుడిపై దాడిచేసిన దోషులపై రౌడీషీట్ తెరవాలి

రాజోలు, జూలై 26(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి మండలం వెలువలపల్లికి చెందిన దళిత యువకుడు దోనిపాటి మహేష్‌పై దాడిచేసిన దోషులపై తక్షణం రౌడీషీట్ తెరవాలని దళిత చైతన్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట దళిత యువకుడిపై దాడిచేసిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ దళిత చైతన్య వేదిక నాయకులు శనివారం నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ సీహెచ్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, సభ్యులు మట్టా సురేష్, చింతా శ్రీనివాస్, బొడ్డపల్లి ప్రసాద్, చింతా మధుకుమార్ పాల్గొన్నారు.

పెదబాలయోగీశ్వరుల 40వ మహాసమాధి వార్షికోత్సవం

ముమ్మిడివరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని భగవాన్ శ్రీపెదబాలయోగీశ్వరుల 40వ మహాసమాధి వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. బాలయోగీశ్వరుల మహాసమాధి వద్ద ఉదయం 4 గంటలకు సుప్రభాతం, ఆశ్రమ ప్రదక్షిణ, 10 గంటలకు ఆరాధన పూజా మహోత్సవం, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. తమిళనాడు, తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి బాలయోగీశ్వరులను దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

పవన్‌కు లిక్కర్ స్కామ్‌లు, సిమెంట్ కుంభకోణాలు లేవు

ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మా నాయకుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు రాష్ట్రంలో లిక్కర్ స్కామ్‌లు, సిమెంట్ కుంభకోణాలు, సాక్షి పేపర్ లేదని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. చరిత్రపై అవగాహన లేని వైసీపీ పేటీఎం బ్యాచ్ అర్థరహిత ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ చరిత్రకు అద్దంపట్టేలా హరిహర వీరమల్లు సినిమా ఉందన్నారు. దేశసంపదను, పేదవాడి కష్టాన్ని ఏవిధంగా దోచుకుంటున్నారో చరిత్ర ఆధారంగా మా నాయకుడు పవన్ సినిమా రూపంలో చూపించారన్నారు. ఈసినిమాను విమర్శించడం తగదని వైసీపీ నాయకులను ఎమ్మెల్యే హెచ్చరించారు. అనంతరం కూటమి నాయకులకు స్వీట్లు పంచారు. సమావేశంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఏఎంసీ ఛైర్మన్ పెనుమాల లక్ష్మి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, మద్దాల సుబ్రహ్మణ్యం, వాసంశెట్టి కుమార్, జాలెం శ్రీనివాసరాజా, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, మద్దా చంటి, బోణం బాబు, ఆదిమూలం సూరయ్యకాపు, జి.రారాజు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంపై సామాజిక తనిఖీ

అమలాపురం రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 26 పీఎంశ్రీ పాఠశాలలపై సమగ్రశిక్ష, పీఎం పోషణ్ (డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజన పథకం)పై సమనస బీసీ గురుకుల పాఠశాలలో శనివారం సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో చేపట్టిన సామాజిన తనిఖీ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ప్రజావేదికలో భాగంగా అభియోగాలు, సలహాలు, సూచనలు స్వీకరించారు. ప్రజావేదికలో సమగ్రశిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ మాట్లాడుతూ పీఎంశ్రీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో ఎక్కడైనా సమస్యలుంటే వివరించాలని సభ్యులకు సూచించారు. సమగ్రశిక్ష సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ఎస్టీఎం కె.సత్యనారాయణ, ఎస్ఆర్పీ వి.కనకారావు, డీఆర్పీలు, 26 పీఎంశ్రీ పాఠశాలల హెచ్ఎంలు, ఎస్ఎంసీ ఛైర్మన్లు సామాజిక తనిఖీలో పాల్గొన్నారు.

వినాయకుని ఆలయంలో హుండీ చోరీ

అల్లవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): గోడిపాలెం రాజులవీధిలో వినాయకుని ఆలయంలో శుక్రవారం రాత్రి హుండీ చోరీకి గురైందని ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు శనివారం ఫిర్యాదుచేశారు. గుర్తుతెలియని వ్యక్తులు హుండీని తోటల్లోకి తీసుకెళ్లి పగులకొట్టి రూ.30వేలు అపహరించారన్నారు.

28న గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

ముమ్మిడివరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాజేలంక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 5,10 తరగతులు, సీనియర్ ఇంటర్, ఎస్సీ-సీ, ఎస్సీ-బీ కేటగిరిలో మిగిలి ఉన్న సీట్లకు అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.శకుంతల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ ఎంపీసీ గ్రూపులో 4సీట్లు, బైపీసీ 6, పదో తరగతి 7, 5వ తరగతి 5 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. విద్యార్థులు ఆధార్ కార్డు, సర్టిఫికెట్లతో ఈనెల28న సోమవారం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపు హాజరు కావాలన్నారు.

'గురుకులం'లో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పి.గన్నవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి):నరేంద్రపురం గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో 35 సీట్లు, ఇంటర్ ఎంఈసీ-34, సీఈసీ-22 సీట్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.వేణు తెలిపారు. విద్యార్థులు ఆధార్‌కార్డు, సర్టిఫికెట్లతో స్పాట్ అడ్మిషన్లకు ఈనెల28న ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటలలోపు హాజరుకావాలన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ



కపిలేశ్వరపురంలో బియ్యాన్ని తనిఖీ చేస్తున్న తహశీల్దార్

కపిలేశ్వరపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కపిలేశ్వరపురంలోని కోరాటివారి వీధి ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని తహశీల్దార్ జీ. శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలు, బియ్యం నాణ్యత, తదితర అంశాలను తనిఖీ చేశారు. అనంతరం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వై. శ్రీనివాస్, వీఆర్‌వోలు సాకా సత్యనారాయణ, వెన్నేటి రామకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో..

రైతుల్ని భాగస్వాములు చేయండి



మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

కె.గంగవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో రైతులను భాగస్వాములను చేయాలని రామచంద్రపురం వ్యవసాయశాఖ ఏడీఏ బీ. నాగకుమార్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ముగింపును పురస్కరించుకుని ఆయన మాట్లాడారు. దీనికోసం వ్యవసాయశాఖ, ఉద్యాన వన శాఖ వీఏఏలు సమగ్ర శిక్షణ పొందాలని సూచించారు. ప్రతి రైతు ఎరువుల వాడకాన్ని తగ్గించే జీవామృతం పాడే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో సద్గురుమూర్తి, ట్రైనింగ్ సిబ్బంది ప్రసాద్, గణేష్, కె. బాబూరావు, ఏ. ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పోలింగ్ స్టేషన్ గుర్తింపు

కపిలేశ్వరపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కపిలేశ్వరపురంలో 198 బూత్ నందు కొత్త పోలింగ్ స్టేషన్‌ను తహశీల్దార్ జి. శ్రీనివాస్ శనివారం గుర్తించారు. కోరాటివారి వీధి స్కూల్ బిల్డింగ్‌ను పోలింగ్ స్టేషన్‌గా గుర్తించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బిల్డింగ్ పరిస్థితి, వసతి సౌకర్యాలు, తదితర అంశాలపై సమీక్షించారు. వీఆర్‌వోలు, సీనియర్ సహాయకులు, టీచర్లు ఉన్నారు.



కపిలేశ్వరపురంలో కొత్త పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్ శ్రీనివాస్

మండపేట మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం

● జీవో నెం 131 విడుదల

మండపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణం రోజురోజుకు విస్తరిస్తున్న నేపథ్యంలో పట్టణ జనాభా పెరుగుదలతోపాటు పరిశ్రమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో పట్టణ ప్రజల 20 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌కు ఎట్టకేలకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. పట్టణానికి జియోగ్రాఫిక్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) విధానంలో రూపొందించిన ముసాయిదా బృహత్తర మాస్టర్‌ప్లాన్‌ను పురపాలక శాఖ ఆమోదించింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్రప్రభుత్వం జీవో నెం 131ను విడుదల చేసింది. నూతనంగా రూపొందించిన మాస్టర్ ప్లాన్‌పై ప్రజలు అభ్యంతరాలు సేకరించిన తర్వాత, మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం ద్వారా తిరిగి ప్రభుత్వానికి పంపించాలని సూచించింది. ఈప్రక్రియ వాస్తవానికి 2018లో జరగాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. ఇపుడు కూటమిప్రభుత్వం ఏర్పడ్డాక మళ్లీ కదలిక వచ్చింది. నూతన ప్రణాళిక అమల్లోకి వస్తే అనేక లోపాలను సవరించుకునే అవకాశం కలగనుంది.



మండపేట పట్టణం వ్యూ

అముజూరు సొసైటీని అభివృద్ధి చేయండి

● టీడీపీ సీనియర్ నేత, మంత్రి సుభాష్ తండ్రి సత్యం



అముజూరు సభలో మాట్లాడుతున్న వాసంశెట్టి సత్యం

కె.గంగవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సొసైటీ పాలకవర్గ సభ్యులుగా నియమితులైన వారు వాటిని పదవుల్లా కాకుండా బాధ్యతగా తీసుకుని అభివృద్ధి చేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం అన్నారు. శనివారం అముజూరు సొసైటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సొసైటీకి ప్రత్యేకమైన చరిత్ర ఉందన్నారు. ఇక్కడ ఇప్పటి వరకూ బీసీలు అధ్యక్షులుగా చేయలేదు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం బీసీకి అవకాశం ఇచ్చింది. రూ. 7 కోట్లు ఉన్న సొసైటీ టర్నవర్‌ను రూ. 14 కోట్లుకు తీసుకెళ్లి రైతులకు మేలు చేయాలని నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన కమిటీకి సూచించారు. తొలుత త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా పెంకే గోవిందరాజు, సభ్యులుగా నేమాని సత్యనారాయణమూర్తి, ఏడిద గంగాధరరావు ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన పెంకే గోవిందరాజు మాట్లాడుతూ మంత్రి సుభాష్ అండదండలతో సొసైటీని అభివృద్ధిలోకి తీసుకెళతానని, రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఎనుముల గోపాలకృష్ణ, మేడిశెట్టి రవికుమార్, ఈదల వాసు, శేషగిరి, మరివాడ చిన్నికృష్ణ, సలాది రమేష్, పెంకే సాంబశివరావు, చిట్టూరి సుబ్బారావు, కర్రి చిట్టిబాబు, సలాది శేఖర్, కొప్పిశెట్టి చంద్రరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, పెంకే శ్రీనివాస బాబా, మాజీ జడ్పీటీసీ నూలకుర్తి వెంకటేశ్వరరావు, కూళ్ల సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు, ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గనికమ్మ వారి ఆలయ వార్షికోత్సవం

అమలాపురం టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అమలాపురం వంటిద్దువారి వీధిలో వేంచేసి ఉన్న గనికమ్మ వారి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా కమిటీ ఆధ్వర్యంలో చండీహోమం జరిపించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రూ. కోటితో రథం గుడి అభివృద్ధి పనులకు శ్రీకారం



మండపేట పట్టణంలో వున్న రథం గుడి

మండపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణం రథం గుడిసెంటర్‌లో వేంచేసియున్న శ్రీఅగస్త్యేశ్వర జనార్దనస్వామి వారి ఆలయాన్ని కూటమిప్రభుత్వం రూ. కోటి వ్యయంతో ఆధునికీకరించేందుకు నిధులు విడుదల చేసింది. ఇప్పటికే ఈ పనులకు సంబంధించి టెండరు ఖరారు కావటంతో ఈనెల 27న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా భూమిపూజ చేయనున్నారు.

వైద్య ఆరోగ్యసిబ్బంది పనితీరుపై సమీక్ష

మండపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గొల్లపుంతకాలనీ టిడ్కో గృహసముదాయంలో వున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కోనసీమ జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి బీవీ సత్యనారాయణ నాలుగు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన వైద్యఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో సిబ్బంది పనితీరు గురించి సమీక్షించారు. ఆరోగ్యశాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. సీజనల్ వ్యాధులపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా ఉద్యోగులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. సమావేశంలో వైద్యఆరోగ్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ చోరీ

అల్లవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గోడిపాలెం రాజులవీధిలోని వినాయకుడి ఆలయంలోని హుండీ శుక్రవారం రాత్రి చోరీకి గురైనట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఈ మేరకు సభ్యులు అల్లవరం పోలీసుస్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు హుండీని తోటల్లోకి తీసుకువెళ్లి పగులకొట్టి, అందులో రూ.30 వేలు దోచుకు వెళ్లారన్నారు. అల్లవరం మండలంలో ఆలయాలే టార్గెట్‌గా వరుస దొంగతనాలు జరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నేడు మండపేటలో అఖిలపక్ష సమావేశం

● మండపేటను రాజమహేంద్రవరంలో విలీనం చేసే అంశంపై చర్చ

మండపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్త విధానాలతో జిల్లాల విభజన చేయటంతో తెలెత్తిన సమస్యలను పరిష్కరించే దిశగా రాష్ట్రంలో కూటమిప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే నియోజకవర్గాల విభజనపై అధ్యయన కమిటీని ఏర్పాటు చేసింది. జిల్లాల విభజన సమయంలో మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరంలో కలపాలంటూ అఖిలపక్షం డిమాండ్‌ను అప్పటి ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. అప్పట్లో ప్రతిపక్ష టీడీపీతో సహా బీజేపీ, జనసేన, కాంగ్రెస్, సీపీఐ వామపక్ష పార్టీలు ప్రజాసంఘాలతోపాటు ప్రజలు కూడా ఉద్యమించారు. కానీ అవేమీ కూడా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టడంతో విభజన అంశాలపై దృష్టిసారించటంతో మరోసారి మండపేటను రాజమహేంద్రవరంలో కలపాలన్న అంశం తెరపైకి వచ్చింది. గతంలో అఖిలపక్షం చేసిన పోరాటం ఇప్పుడు మరోసారి పోరాటానికి సిద్ధమవుతోంది. మండపేట నియో జకవర్గంలో వున్న మండపేట పట్టణంతోపాటు మండపేట రూరల్, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలకు చెంతనే వున్న రాజమహేంద్రవరం 25 నుంచి 30 కిలోమీటర్లకు మించి దూరం ఉండదు. ఇక్కడ నుంచి ప్రస్తుతం వున్న కోనసీ మ జిల్లా అమలాపురం వెళ్లాలంటే సూమారు 60 నుంచి 65 కిలోమీటర్ల దూరం వస్తుంది. ఇక్కడ ప్రజలకు అమలాపురంతో సంబంధాలు తక్కువ ..కారణం అమలాపురం వెళ్లాలంటే మండపేట నుంచి రావులపాలెం బస్సుపై వెళ్లి, అక్కడ నుంచి అమలాపురం బస్సు ఎక్కాలి. అమలాపురం నుంచి కలెక్టర్ కార్యాలయంకు వెళ్లాలంటే మరోబస్సు మారాలి. ఇలా రెండు మూడు బస్సులు ఫైబడి మారాల్సి వస్తుంది. అమలాపురం దూరబారం కావటంతో ఇక్కడ ప్రజలు అంతా తమకు పూర్వం నుంచి రాజమహేంద్రవరం పార్లమెంట్‌లో మండపేట ఉండటం వల్ల రాజమహేంద్రవరం పట్టణం తమకు అనుకూలంగా దగ్గర ఉంటుందని ఇక్కడ ప్రజలు పేర్కొంటున్నారు. మండపేట నుంచి రాజమహేంద్రవరం వెళ్లాలంటే ఒక్క బస్సు మండ పేటలో ఎక్కితే సరిపోతుంది దూరం కూడా 25 కిలోమీటర్ల లోపే ఉంటుంది. అలాగే మండపేట మండలం కేశవరం ద్వారపూడి. జెడ్.మేడపాడు, పాలతోడు. వెలగతోడు, మెర్నిపాడు గ్రామాలకు ఇంకా దగ్గరగా ఉటుంది. గతంలో అఖిలపక్షం తరఫున పోరాటం చేసిన విద్యార్థిసంఘాలు, ప్రజాసంఘాలు మరోసారి మండపేటను రాజమహేంద్రవరంలో మండపేటను కలపాలన్న డిమాండ్ మేరకు అఖిలపక్ష సమావేశం ఆదివారం మండపేటలో నిర్వహించటం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం అధికారంలో వున్న కూటమి ప్రభుత్వంకు స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మండపేటను రాజమహేంద్రవరంలో కలిపే అంశంపై అసెంబ్లీలో లేవనెత్తి రాష్ట్రప్రభు త్వం దృష్టికి తీసుకు వెళ్లారు. ఏది ఏమైనప్పటికీ కోనసీమ జిల్లాలో వున్న మండపేట రాజమహేంద్రవరంలో కలిపే వరకు ఉద్యమించేలా ప్రభు త్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సాధించే దిశగా అఖిలపక్షంలో అన్ని పార్టీలు ప్రజాసంఘాలు ముందుకు వచ్చి పోరాడాల్సి ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.



అఖిలపక్షం ఆధ్వర్యంలో ర్యాలీ (ఫైల్)

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

» మంత్రి జనార్దనరెడ్డి.. గోపాలపురంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



గోపాలపురంలో పర్యటిస్తున్న మంత్రి జనార్దనరెడ్డి, ఎమ్మెల్యే బందారు

రావులపాలెం, జూలై 26(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్టు ఆర్అండ్‌బీ, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖామంత్రి బీసీ జనార్దనరెడ్డి అన్నారు. రావులపాలెం మండలం గోపాలపురంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. తొలుత నియోజకవర్గానికి వచ్చిన మంత్రికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా గోపాలపురంలో చేపట్టేబోయే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, భూమిపూజ చేశారు. పంచాయతీ, ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీని ప్రారంభించారు. యాళ్ల వారి వీధి, సంత మార్కెట్ వద్ద నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీని ప్రారంభించారు. అలాగే స్థానిక లాకుల వద్ద నుంచి నాబార్డు నిధులతో నిర్మించనున్న కాలువగట్టు రోడ్డుకు భూమి పూజ చేశారు. అనంతరం గ్రామంలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కూటమి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు.కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల ఎంపికను చేపట్టండి

ఆలమూరు ఎంపీడీవో రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజు

ఆలమూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 పథకంలో భాగంగా అర్హులైన బంగారు కుటుంబాలను ఎంపిక చేసే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో ఎ.రాజు అధికారులకు సూచించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బంగారు కుటుంబాలను ఎంపిక చేయడంతోపాటు వారిని దత్తత తీసుకునే దాతలను గుర్తించి ఆయా కుటుంబాలకు అవసరమైన కనీస అవసరాలను గుర్తించాలన్నారు. మండలంలో ఎస్సీ ఎస్టీ వారికి ఉచితంగా సోలార్ యూనిట్లు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించడంతో మండలంలో 2047 మందిని గుర్తించామని, వారికి 200యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అందించనున్నట్టు చెప్పారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల నుంచి అంగీకార పత్రాలను స్వీకరించాలని ఎంపీడీవో కోరారు. సమావేశంలో మండల పరిషత్ ఏవో మోహర్‌ప్రకాష్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వర్షంతో రహదారులు బురదమయం

వాడపల్లి వెంకన్న భక్తుల అష్టకష్టాలు



వర్షానికి అస్తవ్యస్తంగా మారిన రహదారి

ఆత్రేయపురం, జూలై 26(ఆంధ్ర జ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం తరలివచ్చిన భక్తులు వర్షాలకు ఇబ్బందులు ఎదుర్కొన్నా రు. శ్రీరామ్‌నగర్‌లో పార్కింగ్ నుం చి దుర్గమ్మ గుడి వరకూ రోడ్డు అబి వృద్ధిలో భాగంగా ఎర్ర మట్టి గ్రావెల్ వేశారు. దీంతో నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదమయంగా మారడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పార్కింగ్ నుం చి దుర్గమ్మ గుడి వైపు వచ్చే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఎడతెరిపి కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ బురదమయంగా మారాయి. కార్లు పార్కింగ్ అభివృద్ధి చేయకపోవడంతో కష్టాలు తప్పడంలేదు. దుర్గమ్మ గుడి చెక్‌పోస్టు వరకూ రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో భక్తులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

శనేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనానికి, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని విజయవాడ డీఐజీ ఎస్ఎస్‌జే లక్ష్మి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు వేద ఆశీర్వచనం అందించి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,52,308 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనరు, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.

రైతుల ప్రయోజనాలకు సొసైటీలు కృషి



రాకుర్తివారిపాలెం సొసైటీ త్రిసభ్య కమిటీని అభినందిస్తున్న దృశ్యం

కొత్తపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): సహకార సొసైటీ త్రిసభ్య కమిటీలు రైతుల ప్రయోజనాలకు కృషిచేయాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి అన్నారు. శనివారం మండలంలోని మోడేకుర్రు శివారు రాకుర్తివారి పాలెం వ్యవసాయ సహకార సొసైటీ అధ్యక్షుడిగా బొక్కా వెంకటకుమార్, సభ్యులుగా గొల కోటి సూర్యనారాయణ(ఏసు), గన్నవరపు చిన్న(జోజి) బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా వారిని టీడీపీ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, దర్నాల రామకృష్ణ, రెడ్డి రామకృష్ణ, గుబ్బల మూర్తి, పల్లి ఏసు, రెడ్డి శ్రీనివాస్, రెడ్డి తాతాజీ, యల్లమిల్లి జగన్మోహన్ పాల్గొన్నారు.

నర్సిపూడి పాలకవర్గం..

ఆలమూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సిపూడి పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా రాయుడు వెంకటస్వామి, సభ్యులుగా డీకేవీ రాజు, కండిబొట్ల బాలాజీ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీ డీవో ఎ.రాజు, సొసైటీ సీఈవో జి.కొండలరావు, నాయకులు దున్నే స్వామినాయుడు, గట్టి రామారావు, వడ్డి దొరయ్య పాల్గొన్నారు.

ఊబలంకలో..

రావులపాలెం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఊబలంక సొసైటీ అధ్యక్షుడిగా మల్లిడి సుబ్బిరెడ్డి, సభ్యులుగా జంపన రామకృష్ణంరాజు, గుత్తుల గోపాలకృష్ణ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు విచ్చేసి త్రిసభ్య కమిటీకి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి సుబ్రహ్మణ్యం, బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

హసన్‌బాదలో కార్గిల్ విజయోత్సవ ర్యాలీ



కాగడాలతో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు

ద్రాక్షారామ, జూలై 26(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం హసన్‌బాదలో శనివారం సాయంత్రం కార్గిల్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో కాగడాలతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. 1999 మేలో పాకిస్తాన్ భారత భూభాగాన్ని ఆక్రమించే ప్రయత్నం చేయగా అప్పటి ప్రధాని కార్గిల్ యుద్ధం ప్రకటించారని తెలిపారు. జూలై 26న యుద్ధం ముగిసిందన్నారు. అప్పటి నుండి జూలై 26న కార్గిల్ విజయోత్సవ ర్యాలీ జరుపుకుంటున్నట్లు తెలిపారు. బీజేపీ అధిష్ఠానం ఆదేశాలతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించామన్నారు.

అశోక్‌గజపతిరాజు బాధ్యతల స్వీకారంపై సంబరాలు

ఆత్రేయపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా అశోక్‌గజపతిరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆత్రేయపురంలో క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. గజపతిరాజు ఫ్లెక్సీని ఏర్పాటు చేసి ప్రమాణస్వీకార సమయంలో సంబరాలు చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో పీఎస్ రాజు, గాదిరాజు ప్రసాదరాజు, ఇందుకూరి సీతారామరాజు, ముదునూరి సత్యనారాయణరాజు, చంటిరాజు పాల్గొన్నారు.

1309.. ఫారం 6, 7, 8 దరఖాస్తులు

క్లెయిమ్‌ల పరిష్కారంపై అభ్యంతరాలుంటే బీఎల్‌వోలకు తెలపండి: ఆర్డీవో అఖిల



రామచంద్రపురం (ద్రాక్షారామ), జూలై 26(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గంలో ఫారం 6, 7, 8 దరఖాస్తులు 1309 వచ్చాయని వాటిపై అభ్యంతరాలు ఉంటే బీఎల్‌వోలకు తెలియజేయాలని ఆర్డీవో అఖిల రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి హోదాలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఫారం-6కు 310, ఫారం-7కు 416, ఫారం-8కు 583 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. క్లెయిమ్‌ల వివరాలు రాజకీయ పార్టీలకు అందజేసి వివరించారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే బీఎల్ఏలు, బీఎల్‌వోలకు తెలియజేయాలని కోరారు. బీఎల్‌వోలు ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణలపై జరిగే విచారణ సమయంలో బీఎల్ఏలు హాజరై అభ్యంతరాలు ఉంటే తెలియపరచాలన్నారు. 18-19 ఏళ్ల వయసున్న వారు ఓటరుగా నమోదు కాకపోతే వెంటనే నమోదు చేసుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రం 11ను రామచంద్రపురం టౌన్‌కు మార్పు చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ మృత్యుంజయరావు, డిప్యూటీ తహశీల్దార్, కె.గంగవరం, కాజులూరు డీటీలు, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి, కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ, బీజేపీ,జనసేన పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాల్లో విద్యార్థుల నమోదు పెంచాలి

ఐఈఆర్పీలతో సమావేశంలో డీఈవో సలీంబాషా



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

రావులపాలెం, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో జిల్లాలోని భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ఐఈఆర్పీలకు కోఆర్డినేటర్ సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా డీఈవో షేక్ సలీంబాషా, అడిషనల్ కోఆర్డినేటర్ జి.మమ్మి విచ్చేసి మాట్లాడారు. భవిత కేంద్రాల్లో విద్యార్థుల నమోదు పెంచాలన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలు అందరూ భవితా కేంద్రాల్లో నమోదు కావాలని, వారి కోసం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించారని, వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వీరు ఫిజియోథెరపీ క్యాంపులకు హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డి.రమేష్‌బాబు, ఎంఈవోలు ఆర్.నాగరాజు, పి.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు పోరాడదాం

మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసే విధంగా ప్రజల తరుపున పోరాడదామని మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వైసీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ అధ్యక్షతన ఆలమూరులో శనివారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. కూటమి మేనిఫెస్టోను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తున్నారని, వారి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలమూరు ఏడీఏగా సీహెచ్‌కేవీ చౌదరి

ఆలమూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ ఆలమూరు అసిస్టెంట్ డైరెక్టర్‌గా సీహెచ్‌కేవీ.చౌదరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రంపచోడవం ఏడీఏగా పని చేస్తూ బదిలీపై వచ్చారు. ఆలమూరు ఏడీఏగా చేసిన కె.నాగేశ్వరరావు పదవి విరమణ చేయడంతో ఆయన స్థానంలో సీ హెచ్‌కేవీ చౌదరిని నియమించారు. ఈ సందర్భంగా ఆయనను మండల వ్యవసాయాధికారులు, సిబ్బంది, పలువురు రైతులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.